

మద్రాస్ ఐఐటీ ప్రతినిధులతో జరిగిన మంత్రుల బృందంలో రాంప్రసాదరెడ్డి


# వైఎస్ఆర్-అన్నమయ్య



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 16 నవంబర్ 2024




శాసన మండలిలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి

# అంగన్‌వాడీ కోడిగుడ్లకు...అనారోగ్యం

- పాడైన సరుకు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు - ప్రతి ట్రేలల్లో 10 పనికిరానివే.. - ఉడికించాక బయట పడుతున్న భాగోతం

**మదనపల్లె, నవంబర్ 15 ప్రభాతవార్త :**

మేడిపండు చూడు..పొట్టవిప్పి చూడు పురుగులుండు అన్న చందాన... కోడిగుడ్డు చూడ నాణ్యమై ఉండు...ఉడక బెట్టి చూడు కుళ్ళి ఉండు ఇదే పద్యం చెప్పుకోవాల్సి వస్తోంది. చిన్నారులకు, గర్భినీలకు బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించడంలో భాగంగా కోడిగుడ్లను ఆహారంలో భాగంగా చేశారు. దీనికి తోడు భారీ మొత్తాన్ని ప్రభుత్వం వెచ్చిస్తోంది. ఇంత ఖర్చు చేస్తున్నా ప్రయోజనం నెరవేరటం లేదు. కాంట్రాక్టర్లు పాడైపోయిన గుడ్లను అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉడికించిన తరువాత వాటిని పారేయాల్సి వస్తోందని అంగన్‌వాడీ నిర్వాహకులు చెబుతున్నారు. కోడి గుడ్ల సరఫరా పక్కాగా నిర్వహించడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టినా నాణ్యమైన వాటిని సరఫరా చేయకుండా కాంట్రాక్టర్లు సరికొత్త మోసం చేస్తున్నారు. చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహారం సరిగా అందటం లేదు. కాంట్రాక్టర్లు మాత్రం వేడిఎక్కువుగా ఉండడం వల్ల పాడైపోతున్నట్లు బుకాయిస్తున్నారు. నాణ్యతలేని కోడి గుడ్ల సరఫరా చేసి వేసవిని సాకుగా చూపడం ఎంతవరకు సమంజసమంటున్నారు. ఈ విధంగా ఏటా కోట్లాది రుపాయలు దోపిడి జరుగుతోంది. జిల్లాలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ పరిధిలో దాదాపు 15 ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రతి రోజూ పౌష్టికాహారం కార్యక్రమం నిర్వహించాలి. గర్భిణీలు, బాలింతలకు వారంలో ఆరు రోజులు పాటు గుడ్లు ఇవ్వాల్సి ఉంటుంది. రెండేళ్ళ నుంచి ఆరేళ్ళ బాలుర వరకు వారంలో నాలుగు రోజులు పాటు గుడ్డు ఇవ్వాలని. ఇలా లబ్దిదారులకు అందించే కోడిగుడ్ల విషయంలో అడ్డుగోలు వ్యవహారం నడుస్తోంది. కాంట్రాక్టర్లు కోడి గుడ్లను సరఫరా చేస్తున్నట్లు లెక్కలో చూపుతున్నా అందులో పాడైపోయిన కోడిగుడ్లు వస్తున్నాయి. ఉడికించిన వాటిని లబ్దిదారులకు అందించకుండానే బయట పారేయాల్సి వస్తోంది. లెక్కకు సరఫరా చేస్తున్నట్లు చూపుతున్నా లబ్దిదారులకు మాత్రం పౌష్టికాహరం అందడం లేదు. అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న పిల్లల సంఖ్య ఆధారంగా కోడిగుడ్లను సరఫరా చేయాల్సి ఉంది. దీనికి ప్రతినెలా మూడు సార్లుగా కోడిగడ్డును కాంట్రాక్టర్లు సరఫరా చేయాల్సి ఉంది. మొదటి పదిరోజులకు పసుపురంగు తరువాత 10రోజులకు పచ్చ, చివర పది రోజులకు బ్లూ రంగుల్లో ఐసిడిఎస్ అనే ముద్ర వేసి కాంట్రాక్టర్లు సరఫరా చేయాల్సి ఉంటుంది. లబ్దిదారుల సంఖ్య ఆధారంగా కాంట్రాక్టర్ వాటిని కేంద్రాలకు అందించాలి. సరఫరా చేసే కోడిగుడ్డు ఖచ్చితంగా 45గ్రాములు ఉండాలి. ప్రతి అట్టలో 30కోడిగుడ్లు ఉంటే అందులో కనీసం 10కిపైగా గడ్లు పాడైపోయినవి వస్తున్నాయని నిర్వాహకులు వాపోతున్నారు. ప్రతినెలా ఇదే పరిస్థితి ఉంటోందని చెబుతున్నారు. ప్రతినెలా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న లబ్దిదారుల సంఖ్య ఆధారంగా సుమారు లక్షలాది కోడి కోడిగుడ్లు సరఫరా చేయాల్సి ఉంది. కోడి గుడ్లను కేంద్రం వరకు సరఫరా చేయడానికి బార్‌కోడ్ విధానాన్ని ఏర్పాటు చేసింది. ఏది ఏమైనా కాంట్రాక్టర్ ఇచ్చే కోడిగుడ్లను నాణ్యతగా ఉండేవి, కుళ్ళిపోయినవి సరఫరా చేయకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందంటున్నారు.



నాసిరకం కోడిగుడ్లు సరఫరా



నాసిరకం కోడిగుడ్లను సరఫరా చేస్తున్న ఓ కాంట్రాక్టర్

## సకల పాప హరణం కార్తీక పౌర్ణమి దీపం

అత్తిరాలలో వైభవంగా శివపార్వతుల కళ్యాణం

గిరి ప్రదర్శనకు పోటెత్తిన భక్తజనం

భక్తిశ్రద్ధలతో త్రేతేశ్వర స్వామి ఖిగంగా హారతి

**రాజంపేట అర్బన్, నవంబర్ 15 ప్రభాతవార్త**



కార్తీకమాసంలో అత్యంత పవిత్రమైన కార్తీక పౌర్ణమి వేడుకలు రాజంపేట పరిసర ప్రాంతాలలో శుక్రవారం అత్యంత ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని స్వామి సన్నిధిలో శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవ ఉభయ దాత కావుటూరి సుబ్రమణ్యం (మణి ) ఆది దంపతుల కళ్యాణానికి పట్టు వస్త్రాలను సమర్పించారు. కళ్యాణోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు తెల్లవారుజాము నుంచే బాహుదా నదిలో కార్తీక దీపాలను మహిళలు వెలిగించారు. అనంతరం అత్తిరాలలో పెద్ద ఎత్తున మణి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయం సంధ్య వేళ నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. గిరి ప్రదక్షణ అనంతరం బహుదా నది ఒడ్డున భక్తిశ్రద్ధలతో ఆలయ అర్చకులు గంగా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరి ప్రదర్శన ,గంగ హారతి కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు పాల్గొన్నారు.కార్తికే పౌర్ణమి సందర్భంగా స్థానిక అమ్మవారి శాలలో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని రాత్రి అమ్మవారి శాలలో ఘనంగా కళ్యాణ ఉత్సవాన్ని నిర్వహించారు. రాజంపేట పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణాన్ని నిర్వహించారు .వేలాది మంది భక్తులు జ్వాలతోరణం తిలకించేందుకు తరలివచ్చారు. మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించారు. అలాగే గుండ్లూరు అగస్త్యేశ్వరస్వామి ,ఊటుకూరు నాగలింగేశ్వర స్వామి, సిద్దులపల్లిలో సిద్దేశ్వర స్వామి ఆలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## ఆ కార్యాలయంలో కుర్చీలు కూడా కరువే

: సమస్యలపై వచ్చేవారు నిలబడి వేచి ఉండాల్సిందే

: ఇది బద్వేలు తహాశీల్దారు కార్యాలయ పరిస్థితి

**బద్వేలు, నవంబర్15 (ప్రభాతవార్త):**



ప్రభుత్వ కార్యాలయాలకు సమస్యలు విన్నవించుకునేందుకు వచ్చే ప్రజలకు సరైన వసతులు కల్పించి, సమస్యలు విన్నవించేందుకు వచ్చిన వారిని గౌరవిస్తూ తక్షణమే పరిష్కరించేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్ని కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేశారు. అయితే కొన్ని కార్యాలయాలలో అధికారులు సరైన వసతులు కల్పించకపోవడంతో సమస్యలు విన్నవించేందుకు వచ్చిన వారు విసిగి వేసారిపోవాల్సి వస్తోంది. ఇది బద్వేలు తహాశీల్దారు కార్యాలయ పరిస్థితి.ఈ కార్యాలయానికి నిత్యం వందల సంఖ్యలో ప్రజలు భూసమస్యలు పరిష్కరానికై, ఇతర సమస్యలు విన్నవించేందుకు వస్తుంటారు తహాశీల్దారు ఛాంబర్‌లో మాత్రం వసతులు ఉన్నప్పటికీ పక్కనే ఉన్న సిబ్బంది కార్యాలయంలో సరైన వసతులు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వీఆర్వో వద్ద నుంచి డిప్యూటి తహాశీల్దారు వరకు అధికారులు అంతా కుర్చీలలో కూర్చుని పనులుచేస్తుంటే వారికోసం వచ్చిన ప్రజలు మాత్రం గంటలకొద్ది నిలబడి విన్నవించుకోవాలి తప్ప వారికి సరైన వసతులు కల్పించలేని దుస్థితిలో ఉన్నారు. వీఆర్వో దగ్గరకు వెళ్లి సమస్యలు విన్నవించాలన్నా ఎంతటి వారైనా నిలబడుకోవాల్సిందే. అక్కడ పనిచేసే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అన్ని వసతులు కల్పించినా ప్రజలకు మాత్రం కష్టాలు తప్పడంలేదు. సమస్యలు విన్నవించేందుకు వచ్చే ప్రతి ఒక్కరినీ గౌరవించాలని ప్రభుత్వం ఒకపక్క ఆదేశాలు జారీ చేస్తుంటే స్థానికంగా మాత్రం అలాంటి వసతుల మాట చెప్పవద్దు అన్నట్లు కార్యాలయంలోపల కనపడతాయి. మేము మాత్రమే కూర్చోవాలి. మిగిలిన వారంతా నిలబడుకోవాల్సిందే అన్నట్లుగా కార్యాలయంలోపల దుస్థితి కనపడుతుంది. పక్కనే తహాశీల్దారు ఉన్నప్పటికీ అప్పుడప్పుడు ఈ కార్యాలయంలోపలికి పరిశీలనకు వచ్చినా వారు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు తప్ప వచ్చిన వారికి కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశాలు జారీ చేయడం లేదని బయట ప్రజలు అంటున్నారు. అదికారులు కూర్చుని విధులు నిర్వహించడం సాధారణమైనా ప్రజలు మాత్రం నిలబడుకుని విన్నవించాలా, ఇదేక్కడైనా ఉందా మార్పు అంటే ఇదేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. కనీసం వచ్చినవారికి గౌరవం, సరైన సమాధానం కూడా చెప్పలేని దుస్థితిలో ఇబ్బంది ఉన్నారంటే దీనిని బట్టి అక్కడ ఎలా పరిపాలన సాగుతుందో తెలుస్తుంది. సిబ్బంది కొరత కార్యాలయంలో ఉన్నా అధికారులు కూడా ప్రజలకు సరైన సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు.

## పల్లెపండగ పనులపై దృష్టి సారించి పురోగతి సాధించాలి

**రాయచోటి, నవంబరు 15, ప్రభాతవార్త:**



పల్లెపండగ పనులపై దృష్టి సారించి పురోగతి సాధించాలని ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు ప్రభుత్వ ప్రధాన్యత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలు, పల్లెపండగ పనులు, విద్యార్థులకు అపార్ ఐడీల మంజూరు, సర్వే రాళ్లపై బొమ్మల తొలగింపు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్ఓ మధుసూదన్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ విద్యాసాగర్‌ను కలిసిన వివేకా కుమార్తె డా.సునీత

- తన తండ్రి వివేకా హత్య కేసులో పోరాడుతున్న సునీత
- హంతకులకు శిక్ష పడేందుకు పోలీసులు సహకరించాలని విజ్ఞప్తి
- సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన రవీంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలి
- ఎస్పీకి విన్నవించిన సునీత

**కడప క్రైం, నవంబరు 15, ప్రభాతవార్త:**

మాజీ మంత్రి వై.ఎస్.వివేకా కుమార్తె డా.సునీతారెడ్డి శుక్రవారం కడప జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ విద్యాసాగర్‌ను కలిశారు. తన తండ్రి హత్య కేసులో ఎస్పీకి విన్నవించింది. నిందితులకు శిక్ష పడేలా చేయాలని విజ్ఞప్తి చేశారు. 5 సంవత్సరాలు పూర్తయినా కేసు కొలిక్కి రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ తన తండ్రి కేసులో ముద్దాయిలు, వారి అనుచరులు తనను బెదిరిస్తూ కేసు ముందుకెళ్లకుండా ప్రయత్నిస్తున్నారని ఆమె ఎస్పీకి వివరించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా గతంలో తన తండ్రి హత్య కేసులో సీబీఐ విచారణ సందర్భంగా సీబీఐ అధికారులపై హంతకుల ముఠా కేసు పెట్టిందని ఆ కేసులు కూడా ప్రస్తుతం విచారణలో ఉన్నాయని వీటన్నింటిపై దృష్టి సారించి న్యాయం చేయాలని ఆమె కోరినట్లు సమాచారం. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రాపై చర్యలు తీసుకోవాలని ఎస్పీతో చర్చించారు. వర్రా రవీంద్రారెడ్డి తనపై, తన కుటుంబ సభ్యులపై విచక్షణారహితంగా పోస్టులు పెట్టారని ఇలాంటి వారిపై చర్యలు తీసుకొని ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. విద్యాసాగర్‌తో కలవడానికి ముందు గత ఎస్పీగా విధులు నిర్వహించిన హర్షవర్ధన్‌రాజును కూడా కలిశారు. అంతకుముందు హోంమంత్రిని కలిసి తన తండ్రి హత్య కేసు తీరును ఆమెకు వివరించి అనంతరం ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలిసి తన తండ్రి హత్య కేసు అంశంపై సుధీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. ఇదే సమయంలో హోంమంత్రితో పాటు జిల్లా ఎస్పీతో తన తండ్రి హత్య కేసులో స్థానిక పోలీసుల అండ ఉందని ఆవేదన వెలిబుచ్చారు. అనంతరం ఆమె కడప నుంచి హైదరాబాదుకు వెళ్లారు. ఎస్పీని సునీత కలవడంతో జిల్లాలో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది.

## జిల్లాలో ఇసుక కొరత లేదు

**రాయచోటి, నవంబరు 15, ప్రభాతవార్త:**



అన్నమయ్య జిల్లాలో ఇసుక కొరత లేదని స్థానిక అవసరాలకు ఉచితంగా ఇసుకను తీసుకెళ్లడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. శుక్రవారం విజయవాడ నుంచి ఇసుక అంశంపై మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిలల్లాలో ఉన్న ఇసుక రీచ్‌లు ఎన్ని పనిచేస్తున్నాయి, ప్రారంభించాల్సినవి ఎన్ని ఉన్నాయి, ఇసుక అందుబాటులో ఉందా తదితర అంశాలపై జిల్లాల వారీగా మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న మొత్తం 5 ఇసుక రీచ్‌లు ఉన్నాయని తెలిపారు. ఇందులో 3 ఇసుక రీచ్‌లు పనిచేస్తున్నాయి. అందులో అవసరమైన ఇసుక లభ్యత ఉందని పేర్కొన్నారు. వీరబల్లి, మట్లిలో త్వరలో ఇసుక రీచ్‌లు ప్రారంభిస్తామన్నారు. స్థానిక అవసరాలకు ఉచితంగా ఇసుకను తీసుకెళ్లడం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఆదర్శ రాజేంద్రన్, మైనింగ్ శాఖ ఏడీ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకం పెను ప్రమాదం

- నేటి సమాజంలో అన్ని చోట్ల ప్లాస్టిక్ కవర్లే..





**ఓబులవారిపల్లె, నవంబరు 15, ప్రభాతవార్త:**

రోజు రోజుకు ప్లాస్టిక్ ప్లాస్టిక్ వాడకం పెను ప్రమాదంగా మారుతోంది. నేటి సమాజంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వాడడం వల్ల ప్లాస్టిక్ భూతం ప్రాణాలు తీస్తోంది. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ లోపం పరిరక్షణ శాపంగా మారింది. ప్రజల ఆరోగ్యం భద్రత ఫుడ్ ఇన్‌స్పెక్టరఉ్లు గాలికొదిలేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎక్కడ చూసినా కల్తీ దానికి తోడు ప్లాస్టిక్ వాడకంతో ప్రజలు ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటున్నారని ఆరోపణలు లేకపోలేదు. వేడిగా ఉన్న టీ ఆ తరువాత వేడిగా ఉన్న తినుబండారాలు నిత్యావసర సరుకులు భోజనశాలలో ఉపయోగించే పప్పు, రసం వంటివి కాలే కాలే తినుబండారాలు సైతం ప్లాస్టిక్ సంచుల్లో వేసి ప్యాక్ చేయడం వల్ల ప్రజలు భోజనం చేసిన తరువాత ఆ ప్లాస్టిక్‌ను చెత్త కుప్పల్లో వేయడంతో ఆవులు, పశువులు వాటిని తినడంతో మృత్యువాత పడుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. అవి మృతి చెందినప్పుడు వాటి కడుపులో కేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఇప్పఇకైనా సంబంధిత ఉన్నతాధికారులు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని వినియోగదారులు కోరుతున్నారు.

## అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ

ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే తనయుడు రాహుల్ రెడ్డి.

అయ్యప్ప భజనలతో పరవశించిన అయ్యప్ప మాలదరణ భక్తులు

**లక్కిరెడ్డిపల్లె నవంబర్ 15 ప్రభాతవార్త**

మండల పరిధిలోని రామాపురం మార్గంలోని నామాల గుట్టపై కార్తీక పౌర్ణమి సందర్భంగా గురుస్వాములు వెంకటేష్, బుజ్జిల ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజను శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తనయుడు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి సోదరుడు రాహుల్ రెడ్డి పడిపూజ కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు.అయ్యప్ప మాలధారణ భక్తులు వందలాది మంది తరలిరావడంతో స్వామియే శరణమయ్యప్ప అంటూ నామాల గుట్ట మారుమోగింది. అయ్యప్ప మాలదరణ భక్తులు అయ్యప్ప స్వామి భజనలతో భక్తులు పరవశించిపోయారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని నామాల గుట్టపై వెలసిన శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక దీపాలను వెలిగించి వారి భక్తిని చాటుకున్నారు. అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహంకు అభిషేక పూజలు నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పడిపూజ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం వందలాది మంది భక్తులకు దాతల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గురుస్వాములు మాట్లాడుతూ అయ్యప్ప మాలధారణ భక్తులకు అయ్యప్ప స్వామి తోడై ఉండి అన్ని విధాల చల్లగా చూడాలని మనసారా కోరుకుంటున్నామని అన్నారు. ఆలయ కమిటీ సభ్యులు రాహుల్ రెడ్డిని దుశాలువాతో సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ పూజ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వహకులు శివశంకర్ రెడ్డి,పాపయ్య, భాస్కర్ రెడ్డి, కొండయ్య, అయ్యప్ప గురుస్వాములు గంగయ్య, గంగయ్య, గంగరాజు,బోస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా శ్రీఉమాదేవి సహిత
## నీలకంఠేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం



**సిద్దవటం, నవంబరు 15, ప్రభాతవార్త:**

సిద్దవటం మండలంలోని కనుమలోపల్లి గ్రామ సమీపానవెలసిన శ్రీఉమాదేవి సహిత నీలకంఠేశ్వర స్వామి ఆలయం ఆవరణలో శుక్రవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శివ పార్వతుల ఉత్సవ మూర్తులకు వైభవంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివ పార్వతుల ఉత్సవ మూర్తులను అలంకరించి వేధికపైకి చేర్చారు. స్వామి వారికి కల్యాణ మహోత్సవంలో భాగంగా గణపతి పూజ, పుణ్యహవాచనం, కంకణాధారణ, జిలకర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించిన వేదపండితుల వేదమంత్రాలతో మంగళవాయిద్యాల మధ్య స్వామి వారి కల్యాణం వైభవోపేతంగా జరిగింది. రాత్రి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. కొందరు మహిళా భక్తులు ఆలయం ఆవరణలో కార్తీక దీపాలను వెలిగించారు. వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు సోమా బాబు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అలాగే నిత్యపూజ కోనలో, కపర్తీశ్వరకోన, జ్యోతి సిద్దవటేశ్వర ఆలయం, సిద్దవటం శివాలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు.



## నిరుద్యోగ ఉపాధ్యాయుల సేవలు గ్రంథాలయాలు

**పీలేరు, నవంబరు 15 ప్రభాతవార్తః**



పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతతో పాటు, డీఎస్సీ పరీక్షకు తయారవుతున్న నిరుద్యోగ ఉపాధ్యాయుల కోసం అవసరమవుతున్న నిరుద్యోగ ఉపాధ్యాయుల కోసం అవసరమైన మెటీరియల్‌ను గ్రంథాలయాల్లో సమకూర్చడం మంచి పరిణామమని పీలేరు ఎంఈఓ లోకేశ్వరరెడ్డి తెలిపారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పీలేరు శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ దినపత్రికలు, వారపత్రికలు, పక్షపత్రికలు, మాస పత్రికలు ఆధ్యాత్మిక గ్రంథాలు, నవలలు, ఇతర రచనా పుస్తకాలతో పాటు 1 నుంచి 10 వతరగతి వరకు పాఠ్యపుస్తకాలను కూడా విద్యార్థుల కోసం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు,. విద్యార్థులు, నిరుద్యోగ యఉవత, ప్రజలు గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానం అభివద్ధి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీఆర్పీ మురళీధర్‌రాజు, లైబ్రేరియన్ అమరనాథ్, సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళపై దాడి.

మదనపల్లి క్రైమ్ నవంబర్ 15 ప్రభాత వార్త.

మహిళపై భర్త కుటుంబీకులు దాడికి పాల్పడ్డ సంఘటన శుక్రవారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. ఘటనపై బాధితురాలు తాలూక పోలీసులకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. సిటిఎం మిట్టపల్లిలో నివాసం రాజశేఖర్ రెడ్డి భార్య స్వప్న ప్రియ (30)కు, భర్తకు ఘర్షణ జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఒంటరిగా ఉన్న స్వప్నప్రియను, భర్త కుటుంబ సభ్యులు దాడికి పాల్పడ్డారు. గాయపడ్డ బాధితురాలని కుటుంబీకులు చికిత్స కోసం మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాలుక సీఐ కళావెంకటరమణ తెలిపారు.

# ఐసిడిఎస్ నూతన సిడిపిఓగా నిర్మలా జ్యోతి

చిట్వేలి, నవంబర్ 15,ప్రభాతవార్త:



చిట్వేలి ప్రాజెక్టు పరిధిలోని ఐసిడిఎస్ నూతన సిడిపిఓగా నిర్మల జ్యోతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తాను మాట్లాడుతూ ఐసిడిఎస్ సిబ్బంది నిక్కచ్చిగా తమ విధులను నిర్వహించాలన్నారు. పిల్లలకు, బాలింతలకు, తల్లులకు అందవలసిన ఆహారాన్ని సకాలంలో అందించాలని సూచించారు. కేటాయించిన సమయం ప్రకారం అంగన్వాడి కేంద్రాలను నిర్వహించాలన్నారు.గతంలో సిడిపిఓగా పనిచేసిన రాజేశ్వరి గ్రేడ్ వన్ సూపర్వైజర్‌గా కొనసాగునున్నారు.

# గ్రంధాలయాలు విద్యాన బాండాగారాలు

కురబలకోట, నవంబర్ 15 ప్రభాతవార్త:



గ్రంధాలయాలు విద్యాన బండాగారాలని కురబలకోట ఏఓ రాధ అన్నారు. జాతీయ గ్రంధాలయాల వారోత్సవాలు పురస్కరించుకొని శుక్రవారం స్థానిక గ్రంధాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు గ్రంధాలయాలకు విచ్చేసి వివిధ పత్రికలు, నవలలు, కథల పుస్తకాలను చదవడం వల్ల మరింత జ్ఞానం పెరుగుతుందని ఆమె తెలిపారు. అనంతరం గ్రంధాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంధాలయ అధికారి చంద్రశేఖర్ వివరించారు. ఈకార్యక్రమంలో గ్రామ సెక్రటరీ శేషగిరి కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు నోట్‌బుక్స్ పంపిణీ

మదనపల్లెక్రైం, నవంబర్ 15 ప్రభాతవార్త :

పట్టణంలోని కదిరిరోడ్డులో వెలుగు ప్రత్యేక పాఠశాలలో ఆశ్రయం పొందుతున్న దివ్యాంగులకు ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి నోట్‌బుక్స్, బిస్కెట్స్ పంపిణీ చేశారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో వారు మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన దాతలు ఈ సాయం చేసినట్లు తెలిపారు.

## పథకాల ముసుగులో టీడీపీ నాయకుల సభ్యత్వ నమోదు

పులివెందుల రూరల్, నవంబరు 15, ప్రభాతవార్త ః



పులివెందుల పట్టణంలో టీడీపీ నాయకులు పథకాల ముసుగులో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేస్తున్నారని మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, వైస్‌ఛైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు అన్నారు. పులివెందుల మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ నాయకులు స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదు కార్యక్రమని చెప్పకుండా పథకాల పేరుతో టీడీపీ సభ్యత్వ నమోదు చేస్తున్నారన్నారు. సభ్యత్వ నమోదు కాకుంటే పథకాలు అందవని ప్రజలను భయపెడుతున్నారన్నారు. ఇస్లాంపురం, జెండామానువీధి, అహోబిళాపురం, తదితర ప్రాంతాలలో టీడీపీ నాయకులు ఈ విధంగా చెబుతున్నారని స్థానికులు తమ దృష్టికి తెచ్చారని వారు అన్నారు. టీడీపీ సభ్యత్వం నమోదు అని చెబితే ప్రజలు చేయించుకోరని, పార్టీలో నాయకుల ఉనికిని కోల్పోతామని కార్యకర్తలతో ఈ విధంగా చేయించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజశేఖర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, కోఆప్షన్ మెంబరు దాసరి చంద్రమౌళి, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తొండూరు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

తొండూరు, నవంబరు 15, ప్రభాతవార్త ః

తొండూరులోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులతో గ్రంథాలయ అధికారిణి స్వరూపరాణి ప్రతిజ్ఞ చేయించారు. సుమారు 50మంది విద్యార్థులు పాల్గొని గ్రంథాలయంలో ఉన్న బాలసాహిత్యం, ఆధ్యాత్మిక సాహిత్యం, సైన్స్ పుస్తకాలు చదివారు.

**- వేంపల్లె ః** వేంపల్లెలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుండి ప్రారంభించారు. గ్రంథాలయ అధికారిణి వనజా కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఎంపీపీ మెయిన్ పాఠశాల విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు పుస్తక పఠనం గురించి వివరించారు. పలు రకాల ఆటలు, పోటీలు నిర్వహించి చివరి రోజున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

## వర్షాభావ పరిస్థితలలో ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి

కాశినాయన, నవంబర్15 (ప్రభాతవార్త):



ప్రస్తుత వర్షాభావ పరిస్థితులలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉంటూ కాచి చల్లార్చి వడబోసిన నీటిని తా గాలని పోరుమామిళ్ల సబ్ యూ నిట్ అధికారి టి.నరసింహారెడ్డి పే ర్కొన్నారు. శుక్రవారం బి.కోడూరు ప్రాథమిక ఆరోగయకేంద్ర పరిధిలోని మేకవారిపల్లె గ్రామ సచివాలయంలో ఫ్రైడే డ్రైనే కార్యక్రమాన్ని నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో దోమల నివారణ, వంటిపై ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో పలు గృహాలను సందర్శిం ఒచి ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం,ఎంఎల్‌హెచ్‌పీల చేత ఫీవర్‌సర్వే చేయించా రు. మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వాటిపై అవగా హన కల్పిస్తూ దోమలు రాకుండా ఉండాలంటే ప్రతిశుక్రవారం డ్రైడే పాటిం చడం వలన దోమలను లార్వా, ప్యూపా దశలోనే అంతమొందించవచ్చు న్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది దేవిక అయేషా, రాజేశ్వరి, ఆశ కార్య కర్తలు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా బృందాల ఏర్పాటు

కాశినాయన, నవంబర్15 (ప్రభాతవార్త):

బద్వేలు పట్టణం 21వ వార్డులో ఉన్న వైసీపీ నాయకులు సోషల్ మీడియా యాక్టివిస్ట్ బి.శ్రీనివాసలరెడ్డిని, అతని కుటుంబ సభ్యులను పోలీసులు అదుపులోకితీసుకున్న సంద్భంగా వారి కుటుంబానికి వైసీపీ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు అక్రమ నిర్బంధాలకు గురవుతన్న సోషల్ మీడియా కార్యకర్తలకు న్యాయ సహాయం కల్పించంతో పాటు వారికి భరోసా ఇవ్వడం, వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిచేలా చర్యలు చేపట్టానున్నట్లు ఆయన తెలిపారు. ఆయా కుటుంబాలకు వైసీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు.

# చినుకు పడితే ఆ రహదారి జలమయం

సిద్దవటం, నవంబరు 15, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన సిద్దవటం కడప ప్రధాన రహదారి కొద్దిపాటి వర్షానికి రోడ్లు జలమయం కావడంతో అటు ప్రయాణికులు ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రహదారుల మరమ్మతులకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇలాంటి దుస్థితి ఏర్పడిందని పలువురు అభి ప్రాయం వ్యక్తం చేశారు. దిగువపేట వద్ద ఉన్న కల్వర్టు పూర్తిగా దెబ్బతిన దంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దిగువపేట గూడూరు సుబ్బయ్య ఇంటి సమీపంలో కడప-బద్వేలు ప్రధాన రహదారి దెబ్బతినడం తో వైద్యశాలకు వచ్చే రోగులకు 108 వాహనానికి ఇబ్బంది తప్పడం లేదు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరు తున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ గంగిరెడ్డిని వివరణ కోరగా వర్షా లు తగ్గిన వెంటనే సిద్దవటం ప్రధాన రహదారి మరమ్మతులు చేపడతా మన్నారు.

# వంద శాతం సబ్సిడీతో మినీ గోకులం షెడ్లు

కలికిరి, నవంబరు 15, ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా పంచాయతీల్లోని రైతులకు వంద శాతం సబ్సిడీతో మినీ గోకులం షెడ్లు నిర్మించుకునేలా అవకాశం కల్పించినట్లు ఎంపీడీవో భానుమూర్తిరావు పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మినీ గోకులం షెడ్ల నిర్మాణాలపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ 2 ఆవులు షెడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా రూ.1.25లక్షలు, అదే విధంగా 4 ఆవులకు రూ.1.85లక్షలు, ఆరు ఆవుల షెడ్డు నిర్మాణానికి రూ.2.30లక్షలు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం మంజూరు చేయనున్నట్లు ఏపీవో తెలిపారు. రైతులు వేగవంతంగా గోకులం షెడ్ల నిర్మాణాలు చేపట్టి సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు రెడ్డి బాషా, మనోహర్, బొజ్జమ్మ, ఫీల్డ్‌అసిస్టెంట్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# స్క్రీనింగ్ పరీక్షలు వేగవంతం చేయండి

సిద్దవటం, నవంబరు 15, ప్రభాతవార్త:



క్యాన్సర్, స్క్రీనింగ్ పరీక్షలు మండల పరిధిలో అన్ని గ్రామాల్లో వేగవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి డా.నాగరాజు అన్నారు. మండలంలోని టక్కోలి బీసీ కాలనీలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి ఫ్రైడే, డ్రైడే సందర్భంగా కీటక జనిత వ్యాధుల గురించి అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ప్రతి ఇంటికి ఫీవర్ సర్వే లార్వా చేయించి గృహాల చుట్టూ పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత లేకుండా చూడాలని, దోమల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పరిరక్షణ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల ఏ వ్యాధులు దరిదాపుల్లోకి రావని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పి.కొత్తపల్లి వైద్యాధికారి డా.రంగలక్ష్మి, సబ్ యూనిట్ అధికారి ఇంద్ల సుబ్బరాయుడు, రాజంపేట పార్లమెంటు కార్యదర్శి అండ్లూరి నాగమునిరెడ్డి, సర్పంచ్ పి.లక్ష్మీదేవి, చిన్నపరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## సీఎస్ఎస్ఆర్ మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజు నోటిఫికేషన్ విడుదల

కమలాపురం, నవంబరు 15, ప్రభాతవార్త:

కమలాపురం నగర పంచాయతీలోని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ మరియు పీజీ కళాశాలకు ఈ విద్యా సంవత్సరం నుంచే అటానమస్ హోదా వచ్చిన సంగతి తెలిసిందే. స్వయం ప్రతిపత్తి హోదాలో ఈ అకాడమిక్ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఎక్స్‌టర్నల్స్ పరీక్షల ఫీజు నోటిఫికేషన్‌ను కళాశాల ఛైర్మన్ సి.వవి.రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పరీక్షల నిర్వహణాధికారి డా.పల్లాకృష్ణ మరియు కళాశాల ప్రిన్సిపల్ డా.జి.వినోద్‌కుమార్ సంయుక్తంగా విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ రాజగోపాల్‌రెడ్డి కళాశాల పరీక్షల నిర్వహణాధికారి పల్లా కృష్ణ, ప్రిన్సిపల్ వినోద్‌కుమార్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల సహాయ అధికారులు పి.మహేష్‌రెడ్డి, ఎస్.అశోక్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## శనగ మరియు మినుము పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

కమలాపురం, నవంబరు 15, ప్రభాతవార్త:



కమలాపురం మండలంలోని పాచికలపాడు గ్రామంలో ఊటుకూరు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డా.వీరయ్య, డా.అంకయ్యకుమార్, కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు ఏవీ నరసింహారెడ్డి, శాస్త్రవేత్త మాధురి పర్యటించి మినుము మరియు శనగ పంటలను పరిశీలించడం జరిగింది. ప్రస్తుతం శనగ పంటలో వర్షాలు కురుస్తునందున వేరు కుళ్ల తెగులు వచ్చే అవకాశం ఉంది. కావునా శనగ పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా హెక్సా కొనోజాల్ మందును 2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జబ్బీరుద్దీన్, పాచికలపాడు వాసుదేవరెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# నిర్వాసితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

ఓబులవారిపల్లె, నవంబరు 15, ప్రభాతవార్త:

పచ్చని ప్రకృతి వడిలో అద్భుతమైన మౌలిక వసతులతో ఆర్ఆర్ 5 లే అవుట్ ఉండేలా సకల చర్యలు తీసుకుంటున్నామని అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ మరియు రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఓబులవారిపల్లె మండలం మంగంపేట వద్ద ఉన్న ఆర్ఆర్ 5 లేఅవుట్‌లో పైలాన్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ నిర్వాసితులకు కేటాయించిన ప్లాట్‌లలో అన్ని సౌకర్యాలను వెంటనే పూర్తి చేసి అందిస్తామన్నారు. గౌరవ సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని ప్రతి ఒక్కరికి ప్రభుత్వ తోడ్పాటు ఉండేలా చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖాధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పుస్తక పఠనంతో విద్యార్థుల్లో సృజనాత్మకత

తంబళ్లపల్లె, నవంబరు 15, ప్రభాతవార్త:



విద్యార్థులు ప్రతి రోజు పుస్తక పఠనం చేయడం వల్ల వారిలో సృజనాత్మకత పెంపొందుతుందని గ్రంథాలయ అధికారి జిలానీబాషా విద్యార్థులకు ప్రబోధించారు. శుక్రవారం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పుస్తక ప్రదర్శనపై విద్యార్థులకు బాలికల గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడు వెంకట నారాయణ అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రతి రోజు గ్రంథాలయాలలోని పుస్తకాలు పఠనం చేయడం అలవరుచుకోవాలని తద్వారా విజ్ఞానంతో పాటు దేశ నాయకుల చరిత్రపై పూర్తిస్థాయిలో అవపోసన పట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠకులు రమణ, రెడ్డప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీమల్లేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా కార్తీక పౌర్ణమి

పెండ్లిమర్రి, నవంబరు 15, ప్రభాతవార్త:



మండలంలోని గంగనపల్లి గ్రామం శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానం పొలతలలో కార్తీక పౌర్ణమి శుక్రవారం కావడంతో తెల్లవారుజామునుంచి పెద్ద ఎత్తున మహిళలు దేవస్థానానికి తరలి వచ్చి దీపాలు వెలిగించి శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకోవడం జరిగింది. క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు ఏర్పాటు, దర్శనం అనంతరం లడ్డు ప్రసాదం పంపిణీ చేశారు. ఉచిత అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందింది. రాత్రి జ్వాలాతోరణం కార్యక్రమం, గంగహారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణనాయక్, టీడీపీ నాయకులు శిరిగిరెడ్డి రాజారెడ్డి, బాలరాజారెడ్డి, శిరిగి బాల నాగిరెడ్డి, మాజీట్రస్ట్ బోర్డు మెంబర్ చంద్రశేఖర్, ఆలయ పూజారులు, ఆలయ సిబ్బంది, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# సదాశివ ఆలయంలో కార్తీక శోభ

తంబళ్లపల్లె, నవంబరు 15, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలం గుండ్లపల్లి పంచాయతీ దిగువపల్లి ఏరులో వెలసిన సదాశివ ఆలయంలో శుక్రవారం మహిళలు పెద్దఎత్తున కార్తీక పౌర్ణమి పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. సర్పంచ్ మౌలాలి, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం నుంచి ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరణ చేశారు. సదాశివునికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూపదీపనైవేద్యాలు సమర్పించి మహిళలు కార్తీక దీపాలు ఆలయ ప్రాంగణంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోహన్‌రెడ్డిలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కోలాటాలు, చెక్కభజనలు, శివనామ స్మరణ కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

# పంచాయతీల అభివృద్ధికి సహకరించాలి

దువ్వూరు, నవంబర్ 15, ప్రభాతవార్త:



మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ కానాల జయచంద్రా రెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సభా భవన్‌లో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రనాళిక 2025-26 సంవత్సరానికి శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి వచ్చే నిధులు ఎలా ఖర్చు పెట్టాలి, వాటిని ఏ విధంగా వినియోగించాలి అలాగే విద్యుత్, పారిశుధ్యం, అభివృద్ధి పనులు వంటి వాటిపై శిక్షణ ఇచ్చారు. ఈ సంధర్భంగా వీడియో ద్వారా గ్రామ పంచాయతీలలో చేయవలసిన పనులను గురించి వివరించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ ద్వారా నిర్వహించారు. ఈ శిక్షణలో సర్పంచులు, ఎంపీటీసీలు, తహసీల్దార్ ఇక్బాల్ బాష, ఈఓపిఆర్డి హరికృష్ణ, ఏపీఓ వసంతకుమార్ పాల్గొన్నారు.

# ఉమ్మడి వనరులను అభివృద్ధి చేయాలి

దువ్వూరు, నవంబర్ 15, ప్రభాతవార్త:



మండలంలోని క్లస్టర్ స్థాయిలో జీవనోపాధుల వనరుల సంధర్భంగా ఉమ్మడి వనరులను అభివృద్ధి చేయాలని జిల్లా కో ఆర్డినేటర్ ఎర్రబల్లి రవి అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అనుసంధానంలో భాగంగా వివిధ గ్రామాల సభ్యులు కలిసి ఉమ్మడి వనరుల గురించి పచ్చదానాన్ని నింపడం, వంకలు, వాగులు, చెరువు, పోరంబోకు కొండలు, గుట్టలలో మొక్కలు నాటి పచ్చదనాన్ని నింపాలన్నారు. ఈ సంధబ్భంగా నూతన మండల ఉమ్మడి వనరుల అభివృద్ధి కమిటీని ఏర్పాటుచేశారు. మండల అధ్యక్షునిగా జేష్ఠాధి వేమయ్య, ఉపాధ్యక్షునిగా మురళీమోహన్, సెక్రటరీగా సురేష్, ఓబులేసు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

## రాజంపేటకు సమర్ధ వంతమైన నాయకత్వం కావాలి



రాజంపేట అర్బన్, నవంబర్ 15, ప్రభాతవార్త:

రాజంపేట నియోజకవర్గానికి సమర్ధ వంతమైన నాయకత్వం కావాలని అక్రమ ఆస్తులను వైకాపా హయాంలో టీడీపీ నేతలపై కేసులు పెట్టి వేధించిన నాయకులతో కుమ్మక్కు అయ్యే నాయకత్వం అవసరం లేదని రాజంపేట మండల గ్రామీణ అధ్యక్షుడు గన్నే సుబ్బనర్సయ్య నాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ఎస్ఆర్ కళ్యాణమండపంలో రాజంపేట మండల టీడీపీ సర్వసభ్య సమావేశం సుబ్బనర్సయ్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి అద్దెపల్లి ప్రతాప్ రాజు, మహిళా అధ్యక్షురాలు అనసూయ దేవి, రాజంపేట పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డీఆర్ఎల్ మణి, అబూబకర్ పార్టీ సీనియర్ నేతలు అమ్మినేని రామనర్సింహులు, అమ్మినేని వెంకటయ్య, ఎక్స్‌మో మల్లికార్జున నాయుడు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. పార్టీ ఆధిష్టానానికి రాజంపేట పరిస్థితులు ఇప్పటికే తెలియజేశామన్నారు. మిలాఖత్ రాజకీయాలు రాజంపేటలో చెల్లవని స్పష్టం చేశారు. ఎన్నికల్లో పార్టీని చావు దెబ్బ తీసిన నాయకుడిని పార్టీలోకి ఆహ్వానించాల్సిన అసవరం తెలుగుదేశంకు ఏమాత్రం అవసంర లేదన్నారు. అంతేకాకుండా పార్టీలో పాత కమిటీలు చెల్లవని చెప్పున్న నాయకుల పట్ల మండిపడ్డారు. ఏ పార్టీలో అయినా సభ్యత్వ నమో దు పూర్తి అయ్యాక నూతన కమిటీలు ఎన్నిక అవుతాయని అంతవరకు గతంలో పార్టీ ప్రకటించిన కమిటీలే ఉంటాయని స్పష్టం చేశారు. ఇదే విశయాన్ని పార్టీ రాష్ట్ర నాయకత్వం స్పష్టం చేసిందని గుర్తు చేశారు. పార్టీకి అద్దె నాయకులు సభ్యత్వానికి కూలీలు అవసరం లేదని చురక అంటించారు. పార్టీ కార్యక్రమాలు పార్టీ కమిటీలతో కమిటీ నేతలతో నిర్వహించకుం డ ఇష్టం వచ్చినట్లు నిర్వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. పార్లమెంట్ అధికార ప్రతినిధి ప్రతాప్ రాజు మాట్లాడుతూ కార్యకర్తలకు గ్రామపంచాయతీ ,మండల స్థాయి నాయకులు, కుటుంబ సభ్యులకు ఏ కష్టం వచ్చినా వెన్నంటే ఉంటామని స్పష్టం చేశారు. పార్టీలో క్షేత్రస్థాయి బలం ఉంటేనే ఏ పార్టీకూఅయినా మంచిదని పేర్కొన్నారు. అంతేతప్ప ఒంటెద్దు పోకడలు పనికిరావన్నారు. అందరికి కలుపుకుపోయి పనిచేయాలని సూచించారు. విభజించి పాలించు రాజకీయాలు పనికిరావని చురక అంటించారు.

## శివాలాయాలలో కార్తీకపౌర్ణమి దీపోత్సవం వేడుకలు

రాజుపాలెం, నవంబరు15, ప్రభాతవార్త.



మండల పరిధిలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీభీమలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకదీపాలు వెలిగించటంతోపాటు జ్వాలాతోరణం వెలిగించారు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని గ్రామగ్రామాన శివాలయాలలో కార్తీకదీపోత్సవం వైభవంగా నిర్వహించారు. శివాలయాలకు మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉయంనుండి నదీస్థానాలు నిర్వహించి ఆలయాలకు వెళ్ళి పూజలుచేయటంతోపాటు సాయంత్రం వేళ దీపారాధన కార్యక్రమం నిర్వహించి పూజలు చేశారు.కార్తీక మాసం శివకేశవులకు ప్రీతిపాత్రం కనుక శివాలయాలతోపాటు వైష్ణవాలయాలతో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

## శివాలయంలో ముస్లిం నాయకుడిచే అల్పాహార విందు

రైల్వేకోడూరు,నవంబర్ 15,ప్రభాతవార్త:



రైల్వేకోడూరు పట్టణంలోని శ్రీ భుజంగేశ్వర దేవాలయం నందు కార్తీక మాసాన్ని పురస్కరించుకొని రైల్వేకోడూరు పట్టణంలోని షంషేర్ బిర్యాని అధినేత శివాలయంలో 1600 మందికి అల్పాహార విందును కుల మతాలతీతంగా పంచిపెట్టారు. ఈ సందర్బంగా షంషేర్ మాట్లాడుతూ శివ భక్తులకు ప్రతి ఏటా కార్తీక మాసాన్ని పురస్కరించుకొని అల్పాహారం ఏర్పాటు చేయడం జరుగుతున్నదని అన్నారు.ముఖ్యంగా శివాలయంలో కమిటీ నాయకులు ఉంగరాల సాయి,చిన్నా లు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలపకుండా ప్రశాంతంగా భక్తులకు అల్పాహార విందును వడ్డించినట్లు ఆయన తెలిపారు.సర్వమత సమ్మేళనంగా శివ భక్తులకు విందు ఏర్పాటు చేయడం పూర్వజన్మ సుకృతమని షంషేర్ విలేకరులకు తెలిపారు.

# అనుమానస్పద స్థితిలో యువతి మృతి

రైల్వేకోడూరు,'నవంబర్ 15 ,ప్రభాతవార్త:



రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట సమీపంలో గుర్తు తెలియని యువతి అనుమానస్పద స్థితి లో మృతి చెందిన విషయాన్ని స్థానికులు వెలుగులోకి తెచ్చారు.ఈ యువతి ఎలా చనిపోయిందో అర్థం కాని స్థితిలో పడి ఉన్న విషయం అర్థం కాని స్థితిలో ఉన్నది.మృతురాలు బలమైన గాయాలతో ఉండడం హత్య, లేక ట్రైన్ కింద నుండి పడిందా,లేక ఎవరైనా చంపేసి పడుకోబెట్టారా అన్న సందర్భంలో యువతి చనిపోయిన ఉన్నది. అయితే చనిపోయిన యువతి 17,18 వయస్సు ఉంటుందని అంటున్నారు.ఈ యువతి రైల్వేకోడూరు ప్రాంతానికి చెందిన యువతి కాదని అక్కడి గ్రామస్తులు తెలిపారు.అయితే స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని పోలీసులు తెలిపారు.

# వద్దాశ్రమంలో దుప్పట్లు పంపినీ

పీలేరు, నవంబరు 15 ప్రభాతవార్తః



పట్టణంలోని సదుం మార్గంలోని శ్రీ లక్ష్మీ వద్దాశ్రమంలో దాదాపు 15 మందికి కార్తీకమాస పౌర్ణమి సంధ్భంగా వద్దులకు మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు, పండ్లు శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా సంస్థ ఛైర్మన్ వంగిమళ్ళ రామచంద్ర మాట్లాడుతూ జీవిత చమరాంకంలో వద్దులకు అవసరమైన వసతి, వైద్యం అందిస్తూ శ్రద్దగా వద్దులను రక్షిస్తున్న ఆశ్రమ నిర్వాహకులను తప్పక అభినందించాల్సిందేనన్నారు. సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టి సుబ్రహ్మణ్యం, సురేష్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి జగన్‌మోహన్, కో కన్వీనర్ వై.వి.రమణ, రాచపల్లె కష్ణమూర్తి, పోతంశెట్టి రమేష్, సుధాకర్‌బాబు, యర్రంశెట్టి రామకష్ణ, రహత్‌బాష, ఆశ్రమ నిర్వాహకులు శ్రీమతి విజయ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యక్ష నగదు బదిలీకి ఎన్‌పీసీఐ అనుసంధానం తప్పనిసరి

పీలేరు,నవంబరు 15 ప్రభాతవార్తః



ప్రభుత్వం ప్రవేశపెట్టిన , పెట్టబోతున్న పలు సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రత్యక్ష నగదు బదిలీకి ఎన్‌పీసీఐ అనుసంధానం తప్పనిసరిగా చేసుకోవాలని పీలేరు పోస్టల్ ఇన్స్‌పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల్లో నగదు బదిలీ పొందోరే లబ్దిదారులు తపాలాశాఖ నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలు సద్వినియోగం చేసుకుని ఎన్‌పీసీఐ లింకు పొందాలన్నారు. పీలేరు డివిజన్ పరిధిలోని పీలేరు, కల్లూరు, భాకరాపేట, దామలచెరువు, మంగళంపేట, గ్యారంపల్లె, రొంపిచెర్ల, చిన్నగొట్టిగల్లు, తపాలా కేంద్రాల్లో 25,802 మందికి ఐపీపీబీ ఖాతాలు ఉన్నాయని, ఎన్‌పీసీఐ అనుసంధానం చేయించుకున్నారని చెప్పారు. మిగిలిన వారు కూడా త్వరగా ఎన్‌పీసీఐ లింకు పూర్తి చేసుకోవాలని తెలియజేశారు. తపాలాశాఖ కొత్తగా ఇంటి వద్దకే బ్యాంకింగ్ సేవలు కూడా వినియోగంలోకి తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంలు గిరిబాబు, సుబ్రహ్మణ్యం, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## 108 ఉద్యోగులు సమస్యల పరిష్కారానికై వినతి



పీలేరు, నవంబరు 15 ప్రభాతవార్తః

108 ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీలేరు మండల తహశీల్దారు భీమేశ్వరరావుకు యూనియన్ తరపున వినతిపత్రం సమర్పించారు. 108 ఉద్యోగుల యూనియన్ నాయకులు శుక్రవారం తహశీల్దారును కలిసి తమసమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలపై వెంటనే ప్రభుత్వం దష్టిసారించి పరిష్కరించాలని లేదంటే ఈనెల 25నుంచి తాము సమ్మెలోకి వెళ్లనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పైలెట్ రహంతుల్లా, బీవీ.చలపతి, శ్రీనివాసులు రవి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# మేకలు, గొర్రెల పెంపకం దార్ల సమస్యలపై ప్రభుత్వాలు స్పందించాలి



పీలేరు,నవంబరు 15 ప్రభాతవార్తః

మేకలు, గొర్రెలు పెంపకం దార్లు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాల్సిన అవసరం ఉందని ఆసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం స్థానిక మదనపల్లె మార్గంలోని మేకలు, గొర్రెలు పెంపకందార్ల సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2.2.0లక్షల మేకలు, గొర్రెలు సంపదపై రూ.4లక్షల కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. వీరి సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో కనీసం 5 శాతం నిదులు కేటాయించాలని డిమాండు చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు నారాయణబాబు మాట్లాడుతూ గొర్రెలు, మేకలు పెంపకంలో మేత, నీరు, వైద్య, వత్తి రక్షణ పెత్తందారుల దాడులు, రోడ్డు ప్రమాదాలు, అభద్రత జీవితాలు తదితర సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలియజేశారు. అర్హత ఉన్న కుటుంబాలకు ప్రభుత్వ రాయితీ రుణాలు మంజూరు చేయాలని డిమాండు చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు కాంతారావు, మునిరత్నం, మునిశేఖర్, బాలకష్ణ, రఘునాథ్, గురవయ్య, గుణ, శ్రీనాద్ తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 16 తేదీన వైభవంగా గంధ మహోత్సవం

కడప, నవంబర్ 15, ప్రభాతవార్తః

దేశంలోనే ప్రసిద్ధ సూఫీ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన కడప , అమీన్‌పీర్ పెద్దదర్గాలో వెలసిన హజరత్ సూఫీ సరమస్త్‌సాని చల్లాకష్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరిఫుల్లా మొహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిస్టివుల్ ఖాద్రి ఉరుసు ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభం కానున్నాయి.అమీన్ పీర్ దర్గా ఉరుసు మహోత్సవం శనివారం పెద్ద దర్గాలో సూఫీ సర్ మస్త్ సాని చిల్లాకష్ ఆరిఫుల్లా మహమ్మద్ మొహమ్మద్ మొహమ్మద్ ఉల్ చిష్తి ఉల్ ఖాదరి గంధ మహోత్సవం అంగరంగ వైభవంగా జరగనుంది.గంధ మహోత్సవంలో భాగంగా మొదటగా ఫకీర్ల దర్గా నుండి బాదుల్లా ఖాన్ మకన్ చేరుకొని అక్కడ చదివింపులు సమర్పించెదరు. సాయంత్రం 6 గంటల 15 నిమిషాలకు పీఠాధిపతి గారు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మలంగ్ షా కు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించెదరు .అనంతరం రాత్రి 9 గంటలకు పీఠాధిపతి స్వగృహం నుండి గంధకలశం తీసుకొని మేళ తాళాలతో, ఫకీర్లతో, దేశ ప్రముఖుల పీఠాధిపతులు, పుర ప్రముఖులు శిష్య కోటి బృందంతో దర్గా చేరుకొని సూఫీసర్ మస్త్ సాని చిల్లా ఖష్ హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరిఫుల్లా మొహమ్మద్ ముహమ్మద్ ఉల్ హుస్సేనీ చీష్టి ఉల్ ఖాదరి మజార్ వద్ద గంధము సమర్పించి ఫాతిహాలు ఇచ్చెదరు. అనంతరం రాత్రి 10 గంటలకు గొప్ప ఖవ్వాలి కార్యక్రమం జరుగును.ఉరుసు నేపథ్యంలో దర్గాను అంగరంగ వైభవంగా అలంకరించడం జరిగినది. ఇప్పటికే వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన భక్తుల కొరకు దర్గా పీఠాధిపతి ఆధ్వర్యంలో ఉచిత వసతి భోజన, నీటి వసతి సదుపాయాలు కల్పించారు.

## నిబంధనల మేరకే స్థానిక అవసరాల ఉచిత ఇసుక విధానం

కడప, నవంబర్ 15, ప్రభాతవార్తః

స్థానిక అవసరాల నిమిత్తం ఉచిత ఇసుక సరఫరా.. విధానం అమలులో ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇసుక రీచుల నుండి ఇసుకను సరఫరా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా .శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శుక్రవారం అమరావతి నుండి స్థానిక అవసరాల నిమిత్తం ఉచిత ఇసుక పంపిణీ విధానంపై మైన్స్ మరియు జియాలజి ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మైన్స్ జియాలజి ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా విసి ద్వారా స్థానిక అవసరాల కోసం వినియోగం కోసం ముందస్తు సమా చారం, ఇసుక బుకింగ్ రిజిస్ట్రేషన్ల పంపకాల స్థితి, ఇసుక సరఫరా నిర్వహణ పై అం దిన ఫిర్యాదులు పరిష్కారాలు, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు.

## శనగ పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



యర్రగుంట్ల నవంబర్ 15 ప్రభాతవార్త

మండలంలోని ఇల్లూరు గ్రామంలోని శనగ పంటను శుక్రవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. ప్రస్తుత వానకాలంలో పంటకు వేరు కుళ్ళు తెగులు వస్తుందని, ఈ తెగులు నివారించడానికి హెక్సోకోనోజోల్‌ను. నీటిలో కలిపి వాడడం వలన తెగులు నివారణ జరుగుతుందని డాక్టర్ వీరయ్య తెలిపారు. మొలకలు రాని పొలాలను పరిశీలించి, నివేదికను కడప జిల్లా వ్యవసాయ అధికారికి పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అంకయ్య కుమార్, కృషి విజ్ఞాన కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ మాధురి, డా. శ్రీవల్లి, కమలాపురం వ్యవసాయ సహాయకులు ఏవి రమణారెడ్డి, ఎర్రగుంట్ల మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, గ్రామవ్యవసాయ సహాయకులు సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

## ముద్దనూరు పోలీస్ స్టేషన్ తనిఖీ

ముద్దనూరు, నవంబర్ 15, ప్రభాతవార్త:

ముద్దనూరు అప్డేట్ పోలీస్ స్టేషన్ నందు శుక్రవారం నాడు జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించాక తొలిసారి ముద్దనూరు పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ తాను ప్రకాశం జిల్లా విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్మెంట్ నుంచి జమ్మలమడుగు డిఎస్పీగా బదిలీపై ఇక్కడికి వచ్చానన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణపై ప్రత్యేకదృష్టి పెడతామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు సబ్ డివిజన్లోని ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం సిఐ దస్తగిరి పోలీస్ సిబ్బందితో మీటింగ్ నిర్వహించి మండలంలోని మట్కా గ్యాంబ్లింగ్, బెల్ట్ షాపులు ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టిని సారించాలని తెలిపారు. పెండింగ్ కేసుల మరియు ఇతర విషయాలపై ఫైలు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది మరియు మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



సుండుపల్లి, నవంబర్ 15, ప్రభాత వార్త:

మండలంలోని మాచి రెడ్డి గారి పల్లి గ్రామం నందు తెలుగుదేశం రాష్ట్ర గిరిజన విభాగం ఉపాధ్యక్షుడు ఆనంద నాయక్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పల్లెల్లో ప్రజలు తమకు తాముగా వచ్చి సభ్యత్వం నమోదు చేసుకోవడం హర్షనీయమన్నారు. ముఖ్యంగా మాచి రెడ్డి గారి పల్లి గ్రామంలో సుమారు 500 మంది నీ నమోదు చేయడం జరిగిందన్నారు. రాజంపేట తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి అయిన బాల సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు ఈ సభ్యత్వ కార్యక్రమం నమోదు చేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట తెలుగుదేశం పార్టీ గిరిజన ఉపాధ్యక్షుడు మూడే జయరాం నాయక్ పాల్గొన్నారు.

## స్వామియే శరణమంటూ మారు మోగిన శివాలయం



వీరబల్లి, నవంబర్ 15, ప్రభాతవార్త:

మండలంలోని అయ్యప్ప మాల వేసిన భక్తులు మండల కేంద్రంలో ఉన్న అతి పురాతన దేవాలయమైన హరిహరాదులు దేవస్థానం నందు గురువారం రాత్రి ప్రత్యేక పడిపూజ నిర్వహించారు. దీంతో శివాలయం అంత అయ్యప్ప నామస్మరణతో మారి మోగిపోయింది. అయ్యప్ప విగ్రహం పెట్టి అభిషేకాలు పూజలు నిర్వహించి, అయ్యప్ప గుడి మాదిరి అరటి కాండాలతో ఏర్పాటు చేశారు. మండలంలోని అయ్యప్ప భక్తులు అంతా ఒక తాటికి చేరి అయ్యప్ప భక్తి పాటలతో స్మరించి భక్తులను ఆనందింప చేశారు . కార్తీక మాసం పౌర్ణమి సందర్భంగా రాత్రి అంతా భజనలు చేపట్టారు. అనంతరం అక్కడకు వచ్చిన భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం మండల అయ్యప్ప సేవా సమితి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

## గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



చెన్నూరు, నవంబర్,15( ప్రభాతవార్త)

సమాజంలో అన్ని వర్గాల వారు గ్రంథాలయాన్ని సందర్శించి జ్ఞానాన్ని సముపార్జించి, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయ నిర్వాహకులు కే.హరికృష్ణ అన్నారు. చెన్నూరు గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకొని శుక్రవారం "పుస్తక ప్రదర్శన"ను నిర్వహించారు. గ్రంథాలయ పాఠకులు, విశ్రాంత ఉద్యోగులు, పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకులు. హరికృష్ణ మాట్లడుతు గ్రంథాలయంలో తెలుగు, ఆంగ్లము, ఉర్దూ, హిందీ ఇతరభాషలలో కలిపిమొత్తం 11214 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పుస్తక పఠనం వల్ల మేధస్సు పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు మరియు ఉపాధ్యాయ ఉపాధ్యాయురాలు భారతి. మరియు బీడీసీ నిర్వాహకురాలు అరుణకుమారి, పాఠకులు పాల్గొన్నారు.

## మంత్రులను కలిసిన పిరమలై కలర్ సంఘం రాష్ట్ర నేతలు

కడప కార్పొరేషన్, నవంబరు15 ప్రభాతవార్త:



పిరమలై కలర్ కులంకు కుల సర్టిఫికెట్లు మంజూరు చేయాలని పిరమలై కలర్ సంగం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్ తేవర్, ఎంబీసీ స్టేట్ ప్రెసిడెంట్ పూసలరవి, రాష్ట్ర కార్యదర్శి రాజా తెవర్, రాష్ట్ర ఉప కార్యదర్శి వెంకటేశ్ తేవర్, చల్లా కుమార్ తేవర్ లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వెలగపూడి సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, మైన్స్ అండ్ జియాలజీ,ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ లను కలిసి వినతి పత్రం అందించారు. పిరమలై కలర్ కులంను ఆంధ్రప్రదేశ్ గెజిట్లో చేర్చాలని, కుల సర్టిఫికెట్ లు మంజూరు చేయాలని కోరమన్నారు. కుప్పం ఇంచార్జ్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ప్రత్తిపాటి పుల్లారావు, గొట్టిపాటి రవి కుమార్, టీటీడీ బోర్డు మెంబర్ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, బీసీ కమిషనర్ జస్టిస్ శంకర్ నారాయణ లను కూడా కలిసి ఈ విషయంపై చర్చించి వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని మంత్రులు సానుకూలంగా స్పందించారన్నారు. కులం సర్టిఫికెట్ కోసం దశాబ్దాలుగా ప్రయత్నాలతో పాటుగా పోరాటాలు చేస్తున్నామన్నారు.

## జాతీయ త్రో బాల్ జట్టుకు జ్ఞానాంబిక విద్యార్థి ఎంపిక

మదనపల్లి క్రైమ్, నవంబర్ 14 ప్రభాతవార్త.



అంతర్జాతీయ స్థాయిలో చెన్నైలో నిర్వహించనున్న త్రో బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారతదేశ జట్టుకు మదనపల్లి శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికయ్యారు అని కరస్పాండెంట్ ఆర్ గురు ప్రసాద్ తెలిపారు. శుక్రవారం అయన మాట్లాడుతూ ఇటీవల ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం బిజినూర్ లో విక్రమ్ యూనివర్సిటీలో 47వ సీనియర్ నేషనల్ త్రోబాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున తమ కళాశాలకు చెందిన పురుషోత్తం, హరీష్ పాల్గొన్నారన్నారు. ఈ టోర్నమెంట్లో మూడవ స్థానానికి జరిగిన పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టుతో ఆంధ్ర రాష్ట్ర జట్టు గెలుపొంది తృతీయ బహుమతి దక్కించుకుందన్నారు. ఇక్కడ పురుషోత్తం ప్రతిభను గమనించిన సెలక్టర్లు 12 మందితో కూడిన జాతీయ త్రో బాల్ జట్టులోకి పురుషోత్తం ఎంపిక చేశారు అన్నారు. ఈనెల 27వ తేదీన చెన్నైలో నిర్వహించే అంతర్జాతీయ స్థాయి త్రో బాల్ టోర్నమెంటులో శ్రీలంక జట్టుతో మూడు రోజులపాటు నిర్వహించే సిరీస్లో పురుషోత్తం పాల్గొంటాడన్నారు.

## నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోండి

యర్రగుంట్ల నవంబర్ 15 ప్రభాతవార్త



మండల పరిధిలోని కలమల్ల గ్రామంలో ఆర్‌టిపిపి కృష్ణానగర్ దళితవాడలో ఆంధ్రప్రదేశ్ నవ యుగ చైతన్య ప్రగతి సొసైటీ ప్రాంతీయ కార్యాలయాన్ని శుక్రవారం కలమల్ల మాజీ సర్పంచ్ వేమయ్య గారి కృష్ణయ్య ప్రారంభించారు. ప్రారంభమనంతరం సొసైటీ అధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ కలమల్ల ఆర్టిపిపి చుట్టుప్రక్కల గ్రామాలలో ఉన్న ఎస్సీ, ఎస్టీ బీసీ మరియు వెనుకబడిన కుటుంబాల నిరుద్యోగ యువత యువకులు చెడు అలవాట్లకు, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సొసైటీ నందు ఇచ్చు శిక్షణలను తీసుకొని ఉపయోగించుకోవాలని కోరారు. సొసైటీ కార్యదర్శి శివరాం మాట్లాడుతూ సొసైటీ ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం ద్వారాచుట్టుప్రక్కల ఉన్నటువంటి యువతి యువకులకు టైలరింగ్ కంప్యూటర్ డ్రైవింగ్ మెడికల్ విభాగలాల్లో శిక్షణల ద్వారా వచ్చే అవకాశాలను సద్విని పలుచుకోవడం ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించుకోవచ్చునున్నారు. ఈ సొసైటీ ద్వారా వాడతా భక్తి సహాయంగా కొంతమేరకు ఉద్యోగ ఉపాధ్యాయ అవకాశాలు కల్పించాలని సొసైటీని స్థాపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ 237 నాయకులు తిరుపాలెడ్డి రవి శేఖర్ రెడ్డి ఆదినారాయణ ఎమ్మార్పీఎస్ నాయకులు ఓబులేసు మాదిగ, పీ వెంకటేష్ మాదిగ, సొసైటీ సభ్యులు వెంకటరమణ, శ్రావణి, ఏఐటియుసి నాయకులు శివయ్య, ఏసు, సురేషు, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### కడప జిల్లా కలెక్టర్‌ను కలిసిన జిల్లా ఏపియన్‌జిజివో నాయకులు

కడప కార్పొరేషన్ నవంబర్ 15 ప్రభాతవార్త:



కడప జిల్లా కలెక్టర్ చేకూరి శ్రీధర్‌ను ఏపీ ఎన్జీవో కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, తదితర ఎన్జీవో నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో ఉద్యోగస్తులందరూ కలిసి పనిచేస్తామన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమములో ఏపీ ఎన్జీ జిఒ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం నిత్యపూజయ్య,పి శ్రీనివాసులు బాలపులయ్య, రాజశేఖర్, నరసింహా రెడ్డి మరియు సిటీ, అధ్యక్షులు చిన్నయ్య, సిటీ నాయకులు నాగార్జున, పద్మనాభం పాల్గొన్నారు.

## పుస్తకాలు పఠనంతో నైపుణ్యత



కడప కార్పొరేషన్ నవంబర్ 15 ప్రభాతవార్త:

57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల రెండవ రోజున ఈరోజు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను యస్.కె.ఆర్, యస్.కె.ఆర్ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీ వి.సలీం బాషా, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్రీ అమీరుద్దిన్ ప్రారంభించి మాట్లాడుతూ పుస్తక పఠనంతో జ్ఞాపక శక్తి, ఏకాగ్రత, కమ్యూనికేషన్, నైపుణ్యత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబేరియన్ పవన్ కుమార్, అసిస్టెంట్ లైబ్రేరియన్ నాదెండ్ల బాబి, లైబేరియన్స్, సురేష్, జేమ్స్ గ్రంథాలయ సిబ్బంది రాజ్ కుమార్, శ్రీనివాసాచార్, మనోహర్, సుబమ్మ, రామ్ ప్రతాప్, రమణ శేకర్ రెడ్డి, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి అనుమానాస్పద మృతి

రాజంపేట,నవంబర్ 15,ప్రభాతవార్త :



రాజంపేట పట్టణంలోని ఏబీయన్ఆర్ కాలనీలో కుంచం మదుబాబు(29) అనుమానాదాస్పదంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు బాత్ రూములో పడి మృతి చెందడంతో అనుమానం వ్యక్తమైందన్నారు. గత 3 రోజుల క్రితం మృతుని భార్య మధుబాబుపై తరచూ గొడవ పడుతున్నట్లు ఫిర్యాదు చేసిందని తెలిపారు. అయితే మృతుని తల్లి మృతుని వంటిపై గాయాలుండడంతో ఎవరో హత్య చేసి బాత్ రూములో పడేశారని అనుమానం వ్యక్తం చేసినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజంపేట పోలీసులు తెలిపారు.

## పార్టీ ప్రతిష్టతను దిగజార్చవద్దు

రాజంపేట,నవంబర్ 15,ప్రభాతవార్త :



నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టతను దిగజార్చవద్దని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో అత్యంత ఆర్థిక పరంగానూ, తెలివి పరంగానూ పేరున్న నాయకులు టిడిపిలో ఉన్నారన్నారు. అయితే వీరు విభేదాలతో సోషల్ మీడియా వేదికగా చేసుకొని ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకొని విమర్శలతో కూడిన ఆరోపణలు చేసుకోవడం తగదన్నారు. దీంతో క్రమశిక్షణ కలిగిన తెలుగు దేశం పార్టీ ప్రతిష్ట దెబ్బతింటుందన్నారు. పార్టీ బలోపేతానికి, నియోజకవర్గం అభివృద్ధికి పార్టీలో ఉన్న నాయకులందరూ విభేదాలను, విమర్శలను విడనాడి అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. వీరి విమర్శలు, ప్రతి విమర్శలతో గ్రూపులుగా ఏర్పడి వారిని నమ్ముకొని ఉన్న కార్యకర్తలు నష్టపోతున్నారన్నారు. వారి మనోభావాలను నాయకులే గ్రూపులుగా ఏర్పడి దిగజారుస్తున్నారన్నారు. క్రమశిక్షణకు మూరు పేరుగా నిలిచిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ ప్రతిష్టతను కూడా గత 40ఏళ్లకు పైగా క్రమశిక్షణతో తీసుకువస్తున్నారన్నారు. ఈ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు కూడా క్రమశిక్షణగా ఉండాలన్నాదే పార్టీ ధ్యేయం, ముఖ్యమంత్రి ఆశయం అని కూడా ఆయన తెలియజేశారు. ఏదైనా సమస్యలు ఉంటే నాయకులు కలసి కట్టుగా పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామని తన వంతుగా నాయకులు, కార్యకర్తలను కోరుచున్నానన్నారు.

### జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యునిగా రామకృష్ణ

గాలివీడు, నవంబర్ 15(ప్రభాతవార్త):

మండల ఎంఆర్‌పీఎస్ నాయకుడు రామకృష్ణను అన్నమయ్య జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యునిగా నియమించారు. గోరాన్‌చెరువు గ్రామం వడిశలవంకపల్లికు చెందిన సీనియర్ తెలుగుదేశం దళిత నాయకుడైన రామకృష్ణను విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాలు అందాయి.

## పౌర్ణమి సందర్భంగా అన్నప్రసాదం

ప్రొద్దుటూరు నవంబర్ 15 ప్రభాతవార్త



కార్తిక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న శ్రీశ్రీశ్రీ చిన్నమ్మ పెద్దమ్మ తల్లి చెట్టు వద్ద టిడిపి బీసీ నాయకులు శ్రీకృష్ణాలయ దేవస్థాన కమిటీ చైర్మన్ చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 300 మంది ప్రజలు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా చల్లా రాజగోపాల్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల కష్టాలు తెలుసుకొని కరోనా తర్వాత వారికి తన వంతుగా సహాయం చేయాలని తలచి ఈ అన్నదాన కార్యక్రమాన్ని గత మూడున్నర సంవత్సరాలుగా కొనసాగిస్తూ వస్తున్నా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మూరబోయిన శ్రీనివాస్ యాదవ్, చింతల రాఘవేంద్ర యాదవ్, సీతంపల్లి రమణ, బంగి శివప్రసాద్, టైలర్ ప్రసాద్, సోమాపురం చక్రవర్తి, టైలర్ దస్తగిరి, ఏసునాథరెడ్డి, డ్రైవర్ భాష పాల్గొన్నారు.

## దళిత ఉద్యోగిపై అసత్య ఆరోపణలు చేయడం తగదు

ప్రొద్దుటూరు నవంబర్ 15 ప్రభాతవార్త




ప్రొద్దుటూరుకు చెందిన రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కార్యదర్శి జై భీమ్ పార్టీ నాయకులు కరుణాకర్ యాదవ్ దళిత ఉద్యోగిపై అసత్య ఆరోపణలు చేయడం తగదని దళిత సైన్యం రాష్ట్ర కార్యదర్శి గాలిబోతుల సుదర్శన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల చాపాడు పోలీస్ స్టేషన్ నందు ఖాదర్ వలీ ద్వారా హెడ్ కానిస్టేబుల్‌కు కరుణాకర్ యాదవ్ ఫిర్యాదు ఇవ్వడం జరిగిందన్నారు మరుసటి రోజు పోలీస్ స్టేషన్‌కి కర్ణాకర్ యాదవ్ లాగా మీరు ఇచ్చిన ఫిర్యాదులో మార్ తప్పులు ఉన్నాయని మార్పులు చేయమని చెప్పారన్నారు కానీ కరుణాకర్ యాదవ్ హెడ్ కానిస్టేబుల్ మొబైల్ కు 5000 ఫోన్ పే చేసి తిరిగి కానిస్టేబుల్ పై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ఒక దళిత ఉద్యోగిపై అసత్య ఆరోపణలు చేస్తున్న కరుణాకర్ యాదవ్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ సంపత్ గూడంచెర్ల దళిత సైన్యం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆశీర్వాదం ఏపీ రాష్ట్ర మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు జేస్తాది భాస్కర్ లు పాల్గొన్నారు.

## పౌర్ణమి రోజున అన్న ప్రసాదం

ప్రొద్దుటూరు నవంబర్ 15 ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పట్టణంలోని మున్సిపల్ కూరగాయల మార్కెట్ వెలుపల వెలసిన శ్రీ శ్రీ బాట పెద్దమ్మ తల్లి దేవస్థానంలో శుక్రవారం మధ్యాహ్నం పౌర్ణమిని పురస్కరించుకొని మోపూరు ఆంజనేయ రెడ్డి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం ధర్మకర్త అమ్ముల దీన్నే సుధాకర్ మాదిగ మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా ఈ పెద్దమ్మతల్లి దేవస్థానం వద్ద క్రమం తప్పకుండా ప్రతి పౌర్ణమి రోజు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా గతంలో ఒక ఏడాది కాలం పాటు ప్రతిరోజు మధ్యాహ్న సమయంలో అన్నదాన కార్యక్రమం తన శక్తి వంచన మేరకు ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. దళితుడునని తనను చిన్నచూపు చూస్తూ కొంతమంది నా ఎదుగుదలను ఓర్వలేక గుడిని కూల్చేందుకు సన్నహాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు లేనిపోని ఆరోపణలు సృష్టిస్తూ తనపై మున్సిపల్ కమిషనర్ కు నిరాధారమైన ఫిర్యాదులు చేయడం వల్ల గుడి ఆవరణంలో ఉన్న గదులు తొలగించడం శోచనీయమన్నారు. అయినా భక్తులు పెద్దమ్మతల్లి దీవెనలు తనకు మెండుగా ఉన్నాయని ఈ విషయంపై రాజీలేని పోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

## వండాడిలో ఉపాధి గ్రామసభ

చిన్నమండెం,నవంబర్ 15, ప్రభాతవార్త:



మండలంలోని వండాడి గ్రామ పంచాయతీలో శుక్రవారం ఉపాధి హామీ గ్రామ సభ పీడీ వెంకటరత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ గ్రామసభలో పనులు గుర్తింపులో భాగంగా పిఆర్‌ఏ వర్క్ లు అనగా గ్రామ వనరులు పటం, సామాజిక పటం, సీజనల్ పటంలు వేసి పంచాయతీ ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పీడీ వెంకటరత్నంతో పాటు ఏపీడి లక్ష్మి నరసయ్య, ఈసీ సూర్య ప్రకాష్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ మురళి, ఫీల్డ్ అసిస్టెంట్ రమణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చోరీ జరిగిందంటూ ఫిర్యాదు

గాలివీడు, నవంబర్ 15(ప్రభాతవార్త):



మండలంలోని గాలివీడు గ్రామ పంచాయతీ దానంరెడ్డిగారిపల్లెకు చెందిన సింగం రమణారెడ్డి అనే వ్యక్తి తన ఇంట్లో చోరీ జరిగిందంటూ స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వివరాలలోకి వెళ్లితే.. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో ఇదే గ్రామానికి చెందిన కొందరు మాటు వేసి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తలుపులు పగులకొట్టి ఇంట్లో బీరువాలో ఉన్న నగదు రూ.2.30 లక్షలు, 5 తులాల బంగారు, విలువైన పత్రాలు తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొనట్లు బాదితుడు తెలిపారు.

## కలమల్ల పీఎస్ తనిఖీ చేసిన డిఎస్పి

యర్రగుంట్ల నవంబర్ 15 ప్రభాతవార్త



మండల పరిధిలోని కలమల్ల పోలీస్ స్టేషన్ ను శుక్రవారం జమ్మలమడుగు నూతన డిఎస్పి వెంకటేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్లోని రికార్డులను, పరిసరాలను తనిఖీ చేసిన అయన సిబ్బందికి తగు సూచనలు సలహాలు చేశారు.

## వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

చిట్వేలి, నవంబర్ 15, ప్రభాతవార్త:

చిట్వేలి మండలంలోని పలు శివాలయాలలో కార్తీక పౌర్ణమి వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. మహిళలు కార్తీకదీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. పాత చిట్వేలి లోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో,స్థానిక శ్యామలాంబ సమేత శ్రీ సోమేశ్వర స్వామి శివాలయంలో, నక్కలపల్లి లోని శ్రీ భవాని శంకర స్వామి ఆలయంలో స్వామి అమ్మవార్ల మూల విగ్రహాలకు అర్చకులు ప్రత్యేక అలంకరణ చేశారు. చిట్వేలి శివాలయంలో జ్వాలాతోరణ కార్యక్రమాన్ని ఆలయ పెద్దలు పెద్ద ఎత్తున నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.నగిరిపాడు, అనుంపల్లి,రాజుకుంట తదితర గ్రామాల శివాలయాలలో పెద్ద ఎత్తున భక్తులు కార్తీక పౌర్ణమి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గ్రామ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి

# తక్షణమే పరిష్కరించండి



లక్కిరెడ్డిపల్లె, నవంబరు 15 ప్రభాతవార్త

గ్రామ సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిపిఓ బాలక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. గిరిజననాయకుడు బిరసాముండి 150 జయంతి పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ముందు చిత్రపటానికి పూలమాలవేసి నివాళిలు అర్పించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాల్డఉతూ గ్రామలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని పొడితడి చెత్తలను వేరుశేసి గ్రామానికి సంతతదతేవాలన్నారు. అలాగే వీది దీపాలు, మంచినీటిబోర్లు మరమత్తులు, డ్రైనేజి సమస్యలపై దృ ష్టిసారించాలన్నారు. గ్రామాలల్లో తాగునీరు సమస్యలు ఎదురవుకుండా ముందుజాగ్రతలు తీసుకోవాలన్నారు. గ్రామ అంబాసిడర్లను ఉపయోగించుకొని గ్రామం లోని కాళీ స్థలాలల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. గతంలో ఆగిపోయిన మరుగుదొడ్డును పూర్తిచేయించండి. గ్రామంలోని సమస్యలు తలెత్తకుం డా చూడాలన్నారు. ఎంపిడిఓ రెడ్డెయ్య, మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలు గుర్తించి తమదృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయ తీకార్యదర్శులు సుదర్శనరెడ్డి, రజినీశ్వరరెడ్డి జయశ్రీ.నాగమణి.రాజేశ్వరరెడ్డి, సిరిబాబు, వేణుగోపాల్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు



లక్కిరెడ్డిపల్లె, నవంబరు 15 ప్రభాతవార్త

కార్తీక మాసం పౌర్ణమి సందర్భంగా పలు ఆలయాలతో పాటు శివనామస్మరణతో శివాలయాలు భక్తులతో మారుమోగాయి. తెల్లవారుజాము నుండి ఆలయాలలో భక్తులు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వ భారతి స్కూల్ సమీపంలోని రెడ్డివారిపల్లె మార్గంలో వెలసిన శివాలయంలో అర్చకులు హరీష్ స్వామి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్ద ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గొర్ల మోహన్ రెడ్డి, భుదేవమ్మ, ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### వాల్మీకి, బోయ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నల్లబోతుల నాగరాజు

ప్రొద్దుటూరు నవంబర్ 15 ప్రభాతవార్త

వాల్మీకి బోయ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రొద్దుటూరుకు చెందిన నల్లబోతుల నాగరాజు ను నియమించారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పదో వార్డు కౌన్సిలర్ టిడిపి అభ్యర్థిగా నల్లబోతుల నాగరాజు సతీమణి పోటీచేసిన సంగతి తెలిసింది అప్పటినుండి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలకు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ పార్టీకి ఎంతో విధేయతగా పనిచేసిన నల్లబోతుల నాగరాజును గుర్తించి రాష్ట్ర డైరెక్టర్ గా నియమించారు. దీంతో పట్టణంలో పార్టీ విజేతకు పట్టం కట్టినట్లయింది.

## వీరబల్లిలో టిడిపి సభ్యత్వ నమోదు

వీరబల్లి, నవంబర్ 15, ప్రభాతవార్త :



రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో వీరబల్లి మండలంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోంది. మండలంలోని తాటి గుంతపల్లి గ్రామపంచాయతీ శికారుపాలెంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పలు గ్రామ పంచాయతీలో గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్ ఇన్చార్జులు, యూనిట్ ఇన్చార్జులు, టిఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులుఅందరూ కలిసి ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు భాస్కరాజు,మాజీ సర్పంచ్ మల్లికార్జున , రైతు విభాగంఅధ్యక్షుడు ప్రసాద్ రాజు, నాగప్ప నాయుడు, తెలుగు యువత నాయకులు సాయిరాజు, నాని రాయల్, వినయ్ గౌడ్, రామకృష్ణంరాజు, రామాంజి, ఎస్టి నాయకులు రాజకొండ, బాయప్ప తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల ద్వారా విజ్ఞాన సముపార్జన

అట్లూరు, నవంబర్ 15,ప్రభాత వార్త :



మండలంలోని గ్రంథాలయంలో శుక్రవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అట్లూరు మండల ఇంచార్జ్ ఎంపీడీఓ భాస్కర్ బాబు పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం భాస్కర్ బాబు మాట్లాడుతూ గ్రంథాలయంలో వివిధ రకాల పుస్తకాల వల్ల ఎంతో జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చు నని, విజ్ఞానానికి తొలిమెట్టు పుస్తకాలేనని పుస్తక పఠనం వలన కలిగే ప్రయోజనాలు విద్యార్థులకు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో శ్రీ విద్య హై స్కూల్ విద్యార్థులు 42 మంది హాజరైనారు.పాఠకులు మస్తాన్ యాదవ్ ,సుబ్బారెడ్డి, గోపాలయ్య, కృష్ణారెడ్డి మరియు శ్రీవిద్య స్కూలు ఉపాధ్యాయులు రమాకాంత్, నాగేంద్ర పాల్గొన్నారు.

## గ్రామ ప్రజలను ఆరోగ్యం ఉంచాలి

పెనగలూరు, నవంబర్ 15, ప్రభాతవార్త:



మండలంలోని మురుగునీరును తొలగించి చెత్తకుండీలో వేసిన చెత్తను శుభ్రం చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని సిపిఐ మండల అధ్యక్షుడు గానుగపెంట ఆదినారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని బెస్తపల్లి గ్రామాన్ని సందర్శించారు. వర్షాల వల్ల మెయిన్ రోడ్డు పక్కన అనకాలమ్మ గుడి దగ్గర వర్షపు నీళ్ళు ఉండడం గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షులు చలపతి, సిపిఐ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ ప్రసాద్, నరసిహులు, చిన్న పాల్గొన్నారు.

## సిద్దారానికి దారేది?

పెనగలూరు, నవంబర్ 15, ప్రభాతవార్త:



మండలం లోని దిగువ సిద్దవరం గ్రామానికి ఎన్ని ప్రభుత్వాలు మారినా రాజకీయ నాయకులు మారినా వర్షాకాలంలో వెళ్లాలంటే బురదలో దిగాల్సిందే, బురద పూసుకోవాల్సిందే. గతంలో ఎన్నోసార్లో ప్రభుత్వ అధికారులకు అర్జీలు సమర్పించినా ఉపయోగం లేకుండా పోయింది. ఎన్నో ఆశలు మధ్య ఏర్పడిన జనసేన టిడిపి బిజెపి కూటమి ప్రభుత్వం అయినా సిద్దవరం గ్రామస్తుల గోడు విని వాళ్ళ గ్రామానికి సిమెంట్ రోడ్ నిర్మిస్తే బాగుంటుందని ఆ గ్రామస్థులు తెలియజేస్తున్నారు.

# శివ నామస్మరణలతో మార్మోగిన శివాలయాలు





**రాజంపేట,నవంబర్ 15, ప్రభాతవార్త :**
పవిత్ర పుణ్యక్షేత్రాలైన శివాలయాల్లో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పూజలు ప్రత్యేక నిర్వహించారు. శివాలయాల్లో తెల్లవారు జామునుంచే జనాలు పోటెత్తి పూజలు నిర్వహించారు. మహిళలు శివాలయాల్లో దీపాలను వెలిగించి వారి మొక్కులను తీర్చుకున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు పవిత్ర క్షేత్రాలైన శివాలయాలు,హర హర శంభో శంకర అంటూ శివనామస్మరణతో మార్మోగాయి. ముఖ్యంగా హత్యరాల త్రైతేశ్వరాలయంలో స్వాముల వారి కళ్యాణాలు, గంగ హరతులు, గిరి ప్రదక్షిణలు వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. హత్యరాల త్రైతేశ్వర స్వామితో పాటు తాళ్లపాక సిద్దేశ్వరస్వామి, ఊటుకూరు, గుండ్లూరు, అగస్త్యేశ్వర ఆలయాలు, మందరం రాచపల్లెలోని ఉమా మహేశ్వరాలయం, రాజంపేట, మన్నూరులలలోని శివాలయాలు, ఎంజీపురం సిద్దిలయ్య గుట్టపై శిద్దేశ్వరాలయం, ఆర్బుదుగుంటుపల్లె శివాలయం, ఆకేపాడు శివాలయం, మందపల్లె అన్నపూర్ణాదేవి, బోయనపల్లి చౌడేశ్వరి దేవి, జట్టి వారిపల్లె సమీపంలోని నాగలేసుని గట్టు ఆలయాలకు భక్తులు విరివిగా హాజరై పూజలు నిర్వహించారు. శివాలయాల ప్రాంగణాల్లో మహిళలు పెట్టిన కార్తీక దీపాలు, అలంకరణలు అత్యంత అద్భుతంగా శివాలయాల్లో శోభనిచ్చాయి. అధికంగా భక్తులు హాజరు కావడంతో అన్ని శివాలయాల వద్ద ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేసి మన్నూరు పోలీసులు ఎలాంటి అసౌకర్యాలకు భక్తులు లోను కాకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. మారు మూల పల్లెలు మొదలుకొని చిన్న, చిన్న శివాలయాలతో పాటు పట్టణంలోని శివాలయాల్లో ఘనంగా మహిళలు, భక్తులు పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల కమిటీల సభ్యులు, భక్తులకు ఉచిత తీర్థ ప్రసాదాలు, అన్నదానాలు ఏర్పాటు చేశారు. కార్తీక పౌర్ణమి శివాలయాల్లో అత్యంత కమనీయంగా భక్తులకు కన్నుల పండుగగా జరిగింది.

## నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ఎనలేని కృషి

**నిమ్మనపల్లె, నవంబర్ 15 ప్రభాతవార్త:**
మదనపల్లె నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఎనలేని కృషి చేస్తున్నట్లు జనసేన నియోజకవర్గ నాయకుడు కళ్యాణ్ కొనియాడారు. శుక్రవారం మండల కేంద్రమైన నిమ్మనపల్లెలో కూటమి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పార్టీ నాయకులు కాని ఎమ్మెల్యేలు కాని గ్రామాల వైపు చూడలేదని ప్రస్తుత ఎమ్మెల్యే నియోజకవర్గంలో అందరికి అందుబాటులో ఉండి 150రోజుల్లో గ్రామాల్లో సిసిరోడ్లు, మదనపల్లెలో ట్రాఫిక్ సమస్య తదితర ఎన్నో అవ్యవసర పనులు చేస్తుంటే ఓర్వలేక కొందరు ఆయనపై విమర్శలు చేయడం తగదని జనసేన, బిజెపి, టిడిపి నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు ప్రదీఫ్, టిడిపి నాయకులు దిలీప్, చంద్రసింగ్, కేశవ, జయశేఖర్, అశ్వర్థ, విష్ణు, కిరణ్, మదన్, నాగేంద్ర, మంజు తదితరులు పాల్గొన్నారు.

## కోర్టులో గంగమ్మకు పసుపు కొమ్ములతో అలంకరణ

**మదనపల్లెక్రైం, నవంబర్ 15 ప్రభాతవార్త :**

కార్తీక పౌర్ణమి పండగ సందర్భంగా మదపపల్లెలోని కోర్డులో గంగమ్మకు శుక్రవారం వేకువజామున ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి పసుపు కొమ్ములతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కోలిపి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి పండగ కావడం తనో మహిలలు అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకొన్నారు. అలయానికి వచ్చిన భక్తులకు అర్చకులు సాయిస్వామి తీర్థప్రసాదాలు అందజేసి భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు.

## న్యాక్‌లో ఉచిత శిక్షణ

**పులివెందుల రూరల్, నవంబరు 15, ప్రభాతవార్త ః**
పులివెందులలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (న్యాక్) నందు నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టరు యం.రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సహకారంతో స్కిల్ కాలేజ్ ద్వారా సర్వేయరు, ఫీల్డ్ ఇంజినీరు, సోలార్ పివి ఇంజినీరు లాంటి వృత్తి విద్యా కోర్సుల నందు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా చదివిన అభ్యర్థులు ఈనెల 25లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 120 రోజుల పాటు ఇచ్చే ఈ శిక్షణకు ఉచిత వసతి, భోజనం కల్పిస్తామన్నారు. అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. ఈ శిక్షణను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## భైరవేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేసిన బీటెక్ రవి



**పులివెందుల రూరల్, నవంబరు 15, ప్రభాతవార్త ః**
వేముల మండలంలోని మోపూరి భైరవేశ్వరాలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి), ఆయన సతీమణి శ్రీలతారెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీటెక్ రవి కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఎర్రిపల్లెలో బోదవ్యాధి సర్వే



**పులివెందుల, నవంబరు 15, ప్రభాతవార్త ః**
నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎర్రిపల్లెలో బోధవ్యాధి సర్వే సందర్భంగా గ్రామంలో రక్తపూతలు సేకరించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ ప్రతి ఏడాది నవంబరులో మండలానికి రెండు గ్రామాలను ఎంపిక చేసి బోదవ్యాధికి సంబంధించి రక్తపూతలు సేకరిస్తామని తెలిపారు. ఫైలేరియా వ్యాధి క్యూలెక్స్ దోమకాటు ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఈ వ్యాధి ప్రాణాంతకం కాకపోయినప్పటికీ తీవ్రమైన శారీరక, మానసిక ఇబ్బందులను కలగచేస్తుందన్నారు. జ్వరంలో మొదలై సంకలు, గజ్జలు, ఇతర ప్రాంతాల్లో బిళ్లలు కట్టడంతో క్రమేణా అవయవాల వాపునకు దారి తీస్తుందన్నారు. సంవత్సరానికి ఒక మోతాదు డీఈసీ, ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. దోమలు పెరగకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి సతీష్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పి శివసౌజన్య, ఆరోగ్య కార్యకర్తలకు గోమిలమ్మ, సరస్వతి, ఆశ కార్యకర్త భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## అనంతగిరిక్షేత్రంలో వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

**బద్వేలు అర్బన్, నవంబర్15 (ప్రభాతవార్త):**

పట్టణంలోని అనంతగిరి క్షేత్రం ఓకాంరేశ్వర ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఓంకారక్షేత్ర అభివృద్ది కమిటి సభ్యులు సాంబశివారెడ్డి, కేవి.సుబ్బారావు, సివి.నాగేశ్వరరావు, సుభాష్, శంభూ ప్రసాద్, జయరామిరెడ్డి తోపాటు పలువురు కమిటి సభ్యుల ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహిచారు. ముందుగా కార్తీక కృత్తిక ద్వీపప్రజ్వలన మహోత్సవం ఓంకార స్థాపన ప్రారంభించారు. అనంతరం పలువురు కమిటి సభ్యులు భక్తుల కొరకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి వారు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా చూశారు.

## ఘనంగా నారాయణ స్కూల్ ప్రథమ దశాబ్ది వార్షికోత్సవం



**వేంపల్లె, నవంబరు 15, ప్రభాతవార్త ః**
వేంపల్లె పట్టణంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ప్రథమ దశాబ్ది వార్షికోత్సవం, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 135వ జయంతి సందర్భంగా బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు కరస్పాండెంట్ నారాయణరెడ్డి తెలిపారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో తమ ప్రతిభా పాటవాలు కనపరిచారు. ఈ కార్యక్రమానికి ఏపీసీసీ మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి, కెఎస్‌ఆర్‌ఎం కాలేజి ప్రిన్సిపల్ మూర్తి, నెల్లూరు ఆర్‌ఎన్‌ఆర్ కాలేజి ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డి, వేంపల్లె మండల టీడీపీ ఇన్‌ఛార్జి మునిరెడ్డి, ఇస్కాన్ ప్రవచన కర్త స్వామి సుకదేవ్, టీడీపీ నేత దర్బార్, జబర్దస్త్ టీం కళాకారులు హరిత, శాంతకుమార్, రైజింగ్ రాజు, ఇమ్మానుయేల్, యాంకర్ మౌనిక, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ నెహ్రూ గొప్ప దేశభక్తుడు, దార్శనికుడన్నారు. నవభారత నిర్మాత అని కీర్తించారు. జబర్దస్త్ కళాకారులు శాంతకుమార్ తమ టీమ్‌తో కలిసి మిమిక్రీ ప్రదర్శనతో విద్యార్థులను, తల్లిదండ్రులను ఎంతగానో అలరించారు. నారాయణ స్కూల్ అతి తక్కువ సమయంలో మంచి పేరుతో ప్రతిష్టాత్మకంగా నిలిచిందన్నారు.

## కల్యాణ మండపం స్థలం కోసం బీటెక్ రవి దృష్టికి తీసుకువెళ్తా

**వేంపల్లె, నవంబరు 15, ప్రభాతవార్త ః**
బలిజ సంఘం కల్యాణ మండపం నిర్మాణం చేసుకునేందుకు ప్రభుత్వ స్థలం మంజూరు కోసం పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) దృష్టికి తీసుకువెళ్తానని టీడీపీ మండల కన్వీనరు రామమునిరెడ్డి అన్నారు. కార్తీక మహోత్సవాల్లో భాగంగా బలిజవీధిలో ఉన్న గౌరీదేవి ఆలయంలో 5రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా సంఘం పెద్దల ఆహ్వానం మేరకు రామమునిరెడ్డి దంపతులు గౌరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బలిజ సంఘం అధ్యక్షుడు నంబూరు కుళ్లాయప్ప, కటిక చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు ఎడాల రామా, ఎద్దుల రాములు కలిసి బలిజ సంఘం కల్యాణ మండపం ఏర్పాటు చేసుకునేందుకు స్థలం మంజూరు చేయించాలని టీడీపీ మండల కన్వీనరు రామమునిరెడ్డిని కోరారు. బలిజ సంఘం సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ముందుంటుందని రామమునిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు వీరభద్ర, దక్కా రమేష్, మడకా శ్రీనివాసులు, తులసి, వెంకట్, బాబా, నామాశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కార్తీక పౌర్ణమి వేడకలు



**బద్వేలు అర్బన్, నవంబర్15 (ప్రభాతవార్త):**
కార్తీక మాసం పురస్కరించుకుని శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా పలు శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునుంచే హరోంహర, శంభోశంకర వంటి హరనామ స్మరణతో ఆలయాలన్ని మార్మోగాయి. అంతేగాక పలువురు భక్తులు దీపాలను వెలిగించి కార్తీకమాస విశిష్టతను పండితుల ద్వారా తెలుసుకున్నారు. శివునికి ఎంతో ప్రీతికరమైన ఈ కార్తీక మాసంలో భక్తులు ఎలాంటి పద్ధతులు ఆచరి ంచాలో పూజారులు తెలిపారు. చెన్నంపల్లె వద్ద శ్రీ పార్వతిదేవి సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజామునుంచే భక్తులు పోటెత్తారు. ప్రత్యేక అభిషేకంలో బీజేఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ బైసాని శివశంకర్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు పలువురు స్వామి వారి అభిషేకాన్ని తిలకించారు. అలాగే తెలుగుంగ సాయిబాబా ఆలయం వద్ద వెలసిన శ్రీ మృత్యుంజయ ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ భక్తిని చాటుకున్నారు.

## ఆర్యవైశ్య స్టేట్ కార్పోరేషన్ డైరెక్టర్‌ను కలిసిన పలువురు

**బద్వేలు అర్బన్, నవంబర్15 (ప్రభాతవార్త):**

నూతనంగా ఆర్యవైశ్య స్టేట్ కార్పోరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పరిటాల వెంకటసుబ్బయ్యను శుక్రవారం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఆర్యవైశ్య వ్యాపారులు పేర్ల జనార్థన్, సుధాకర్, నేలపాటి గోవిందయ్యతో పాటు టీడీపీ నాయకులు లకిడి విజయభాస్కర్, దద్దం నాగార్జున, మస్తాన్‌బాబు, సుంకుశివ, సుమంత్‌తో పాటు పలువురు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం పలువురు ఆర్యవైశ్య సంఘ పెద్దలు మాట్లాడుతూ టీడీపీ పార్టీలో అనేక సంవత్సరాలుగా సేవలందించి పరిటాల వెంకటసుబ్బయ్యను గుర్తించి వారికి ఆర్యవైశ్య స్టేట్ కార్పోరేషన్ డైరెక్టర్‌గా నియమించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



## అర్జీదారులకు వేగంగా పరిష్కారం చూపాలి



**గాలివీడు, నవంబర్ 15(ప్రభాతవార్త):**
ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం ద్వారా అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేలా సత్వర చర్యలు చేపట్టాలని ఆర్డీఓ ఏ.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందిన ప్రతి అర్జీని ప్రాధాన్యతగా ఎప్పటికప్పుడు బాధ్యతాయుతంగా నూరు శాతం పరిష్కరించాలన్నారు. మండల స్థాయిల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కూడా చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. వచ్చిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సమస్యపై అవగాహన కలిగించుకొని పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం గోరాన్‌చెరువు గ్రామంలో ఎక్కువగా భూసమస్యలు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రావడం పట్ల విచారం వ్యక్తం చేస్తూ వీఆర్ఓ రవీంద్రారెడ్డి పనితీరుపై మండిపడ్డారు. అనంతరం డాటెడ్ ల్యాండ్స్, ఇనాం ల్యాండ్, రీవెరిఫికేషన్, సచివాలయం సేవలైన క్యాస్ట్, ఇన్‌కమ్, బర్త్ సర్టిఫికెట్లను సకాలంలో విద్యార్థులకు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అర్జీదారులతో స్వయంగా చరవాణిలో మాట్లాడి స్థానిక అధికారుల పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

## వైభవోపేతం ... కోటి దీపోత్సవం...



**ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 15, ప్రభాతవార్త :**
కార్తీక పౌర్ణమి సందర్భంగా శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్ట్ స్వామినీ శివదర్శనానంద సరస్వతీ మాతాజీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ గీతాశ్రమంలో నిర్వహించిన కొటిదీపోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. పరవ శివుని విగ్రహాన్ని భక్తి శ్రద్ధలతో పల్లకి సేవను శివనామ స్మరణల మధ్య జరిపారు. వైదిక మంత్ర పఠనం, శివలింగాని మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అష్టోత్తర శత నామావలి, బిల్వార్చనలను వేద మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివదర్శనానంద సరస్వతీ మాతాజీభక్తుల నుద్దేశించి మాట్లాడుతూ పరమశివునికి కార్తీక మాసం ఎంతో ప్రీతికరమని, కార్తీక మాస విశిష్టతను వివరించారు. భక్తితో శరణు వేడితే తప్పక కోరికలు తీర్చే భోళాశంకరుడని శివుని మహిమలను, గొప్పతనాన్ని తెలిపారు. కార్తీక పౌర్ణమి ప్రాధాన్యతను కొటి దీపాలు వెలిగించడం ద్వారా కలిగే శుభాలను భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా భక్తిగీతాలకు విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శన భక్తులు ఆసక్తిగా తలికించారు. కార్యక్రమానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. ఏర్పాట్లను శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీట పల్లేటి ప్రభాకరరెడ్డి, ట్రస్టీలు చెన్నకేశవులు, వెంకట రమణ. భక్తులు పర్యవేక్షించారు.

## ఈనెల 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

**మదనపల్లె, నవంబర్ 15 ప్రభాతవార్త :**

రైతులు,పేద ప్రజల పాలిట ఉరితాడు కాగల ఎలక్ట్రిసిటి బిల్లును ఉపసంహరించుకోవాలని ఈనెల 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణప్ప, సాంబశివ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూనన శుక్రవారం గుర్రంకొండలోని ఏఐటియుసి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని నిర్బంధ భూసేకరణ చట్టం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం నరూ.26వేలు అమలు చేయాలని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, డెయిలీవేజ్, కంటినెంట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. హంద్ర-నీవా, గాలేరు, నగిరి నీటి ప్రాజెక్టులు పూర్తి కావడానికి అవసరనమైన నిధులు కేటాయించాలని అన్నమయ్య ప్రాజెక్టు పున:నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మురళి, సయ్యద్ ఇక్బాల్, వసీం, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశావర్కర్స్‌కు సంబంధంలేని పనులు చేయించడం అన్యాయం

### డిప్యూటి డిఎం అండ్‌హెచ్‌ఓ కార్యాలయం ముందు ధర్నా

**మదనపల్లె, నవంబర్ 15 ప్రభాతవార్త :**

ధర్నా చేస్తున్న దృశ్యం

ఆశా వర్కర్స్‌కు సంబంధం లేని పనులు, కార్యకర్తలపై వేధింపులకు పాల్పడుతున్న సిటిఎం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని వైద్యాధికారి ఘాన్సీలక్ష్మీ, సిహెచ్‌ఓ అరుణ, సూపర్‌వైజర్ సుమతిలపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిలా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, జిల్లా కోశాధికారి హరిశర్మ, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మలు డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలకు సంబంధం లేని పనులు చేయించడం, వేధింపులకు పాల్పడడం లాంటి చర్యలకు నిరసనగా డిప్యూటి డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం ముందు ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు.వేదింపులు ఆపి పనిభారాన్ని తరగ్గించాలని, సంబంధం లేని పనులు చేయించరాదని, రికార్డువర్క్ ఏదైనా ఒకపని ఒక్కసారి మాత్రమే చేయించాలని అధికారులు ఆపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రమామణి, మల్లేశ్వరి, నాగరత్న, శ్రావణి, పద్మావతి, లలిత, పుణ్యవతి, గాయత్రి, ప్రసన్న, రమాదేవి, అమరావతి, పార్వతి, బాలకుమారి, జానకి,న నిర్మల పాల్గొన్నారు.

## ఘనంగా శివపార్వతుల కళ్యాణోత్సవం

**నిమ్మనపల్లె, నవంబర్ 15 ప్రభాతవార్త :**

నిమ్మనపల్లె మండలం తవళం అటవీప్రాంతంలోని శివాలయంలో శుక్రవారం మండలం లోని వందలాది మంది మహిళలు కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్ష దీపారాధన కార్యక్రమంలో పాల్గొని దీపారాదన చేశారు. అనంతరం శివపార్వతుల కళ్యాణ అంగరంగ వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తాదుల నడుమ కళ్యాణోత్సవం జరగగా వేద పండితులు రెడ్డప్ప, నరసింహ, శంకర, స్వాములు, కళ్యాణం జరపగా తాత్యాలిక ఛైర్మెన్ మేస రామక్రిష్ణ అన్నదాన ధర్మకర్త రెడ్డప్పరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డప్ప, గ్రామ కార్యదర్శి గౌతమి, విఆర్ఓ శ్రీనివాసులు పాల్గొనగా ఎస్ఐ తిప్పేస్వామి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కళ్యాణోత్సవం అనంతరం రాత్రి పాలలో చంద్రున్ని వేదపండితులు చూపించారు. నంది సిద్దప్ప కుటుంబీకులచే శిఖరం ముందు జ్యోతిని వెలిగించిన అనంతరం శివపార్వతులకు కళ్యాణం జరిగింది.

## రోజులు గడుస్తున్న మొలకలు రాని సెనగలు

**యర్రగుంట్ల నవంబర్ 15 ప్రభాతవార్త**

మండలంలో 4500హెక్టార్ల మేరకు ప్రభుత్వం సరఫరా చేసిన శనగలను కొనుగోలు చేసి విత్తనం వేసి 12రోజులైనా కూడా మొలకలు రాకకుపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. పొలం దుక్కి విత్తనాలు వేసి పడిగాపులు కాస్తున్న మొలకలు రాకపోవడంతో రైతాంగం అయోమయంలో ఉందన్నారు. రైతులు ఆర్థిక ఇబ్బందులతో ఒకసారి పంట వేయాలంటేనే బరువుగా పొలాలను వదులుకోలేక పంటలను సాగు చేయాల్సి వస్తుందన్నారు. పొలంలో మొలకలు రాకపోవడంతో నిరాశ చెందిన కొంతమంది రైతులు మళ్లీ అపోసప్పుచేసి ప్రభుత్వం సరఫరా చేసిన శనగలపై ఆశలు వదిలేసి కొంత మేరకు మళ్లీ రైతుల దగ్గర శనగలు కొనుగోలు చేసి విత్తనాలు నాటడం జరిగిందన్నారు. ఈ కాలంలో సమయానికి విత్తనాలు వేయకపోతే పంట ఇచ్చే ప్రయోజనాలు కూడా అంతంత మాత్రం ఉంటాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చే విత్తనాలు ఏ విధంగా ఉపయోగించాలో విత్తనాలు ఇచ్చే సమయంలో పూర్తి సమాచారం కల్పించి ఇచ్చినట్లయితే రైతుల నష్టపోకుండా వారి విధివిధానాలతో పంటలను సాగు చేసుకునేవారు. అధికారుల నిర్లక్ష్యం వీడి రైతులకు ఇచ్చే విత్తనాలు, వాటి అవగాహన చేసే విషయంలో జాగ్రత్తలు వహించాలని కోరారు.



## నేత్ర పర్వంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు

**బద్వేల్, నవంబర్15, ప్రభాతవవార్త :**
పట్టణంలోని గౌరిశంకర్ నగర్‌లో నెలకొన్న శ్రీరామ సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతాలను బ్రాహ్మణ సంఘం ఆద్వర్యంలో ఆ సంఘం అధ్యక్షుడు చెప్పలి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఉపాధ్యక్షుడు సింగంపల్లె శివయ్య కార్యనిర్వాహకుడుగా శుక్రవారం నేత్ర పర్వంగా నిర్వహించారు. ఈ కార్యక్రమమంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన సామాజిక అసమానతలకు అతీతంగా పలువురు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష్య దైవం శ్రీ వేంకటేశ్వరునితో సమానంగా భక్తజన పూజలు అందుకొంటున్న శ్రీ సత్యనారాయణుడు ఆంధ్రుల ఆరాధ్య దైవం అని హిందువుల ప్రతి శుభకార్యాన్ని అనుసరించి సత్యనారాయణుడికి వ్రతం చేయడం ఆనవాయితీగా వస్తున్నదన్నారు. వ్యక్తిగతంగా స్వామి వారి వ్రతం చేయడం వ్యవప్రయాసలతో కూడిన అంశం కావునా సత్యదేవుని సన్నిధిలో సామూహిక వ్రతాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్రతాలను అమ్మవారి శాలలో ప్రధాన పూజారి సుబ్బనరసయ్య స్వామి నిర్వహిస్తూ వ్రతంతో పాటుగా సత్యదేవుని కథలను ప్రవచించారు ఈ కార్యక్రమములో బ్రాహ్మణ సేవా సంఘం

## వైభవంగా అన్నమయ్య ఉత్సవం



**రాజంపేట,నవంబర్ 15,ప్రభాతవార్త :**
కార్తీక పౌర్ణమి సందర్భంగా పద కవితా పితామహుడు అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక గ్రామంలో శుక్రవారం టిటిడి దేవస్థానం ఆద్వర్యంలో అన్నమయ్య గ్రామోత్సావాన్ని కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామస్థులు శాన్వీ ఇంటర్‌నేషనల్ పాఠశాలనుంచి ప్రారంభించి అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వరకు గ్రామ ప్రజలు ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కర్యక్రమానికి అన్నమయ్య 12వ తరానికి చెందిన వంశీకులు తాళ్లపాక హరినారాయణాచార్యులతో పాటు తాళ్లపాక గ్రామస్థులు జవ్వాజి, అదృష్టదీవుడు, జవ్వాజీ మోహన్, టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు, గ్రామస్థులు హాజరయ్యారు. మహిళల కోలాట నృత్యంతో అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తూ అత్యంత కోలాహోల ఆనందాలతో అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వరకు ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## బి.సి బాలుర వసతిగృహాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి

**బద్వేలు లీగల్, నవంబరు 15 ప్రభాతవార్త :**

బాలల దినోత్సవమును పురస్కరించుకొని బద్వేలు నందలి బి.సి బాలుర వసతిగృహాన్ని బద్వేలు సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ సందర్శించడం జరిగినది. ఈ సందర్భంగా ఆమె వసతి గృహంలోని బాలల యొక్క యోగ క్షేమాలను, వసతులను తెలుసుకోవడంతో పాటు అక్కడి అధికారుల పనితీరు, సిబ్బంది బాలల పట్ల వ్యవహరించు తీరుతెన్నులు వగైరాలను గురించి క్షుణ్ణంగా తెలుసుకోవడమేగాక నేటి బాలలే రేపటి పౌరులని, అలాంటి బాలలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లి దండ్రులకేగాక విద్యా బోధన చేసే ప్రతి ఒక్కరిపై కూడా ఉందని వారికి చదువుతో పాటు పరిశుభ్రత, సంస్కారము, క్రమశిక్షణ తప్పనిసరిగా నేర్పించాలని, పెద్దల పట్ల చిన్నతనం నుండే గౌరవ భావము, భక్తి భావము ఉండే విధంగా చేసి భావితరాల వారికి మార్గదర్శకులుగా చేయాలని, చదువుతోపాటు క్రీడలను కూడా ప్రోత్సహిస్తూ వారి మానసిక వికాసానికి కూడా కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె అక్కడి పిల్లలకు మిఠాయిలను పంచిపెట్టారు మరియు అక్కడి అధికారులకు పిల్లల యోగక్షేమాల గురించి, వసతుల గురించి ఇంకనూ తీసుకోవలసిన చర్యల గురించి విశదపరిచి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్తీకం శివ కేశవులకు ప్రీతికరం

**గాలివీడు, నవంబర్ 15(ప్రభాతవార్త):**

కార్తీక మాసం శివకేశవులకు ఎంతో ప్రీతికరమైన మాసం అని వేదపండితులు నాగఫణికిశోర్‌శర్మ పేర్కొన్నారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పవిత్ర పాపాఘ్నినది ఒడ్డఉన వెలసిన శ్రీ గండిమడుగు ఉమామహేశ్వరస్వామి ఆలయం, కుషావతి నది ఒడ్డున వెలసిన శ్రీ ఆంజనేయ గణపతి సమేత శివాలయాలలో కార్తీక పౌర్ణమి పూజలు నిర్వహించారు. వేకువజామునే నదీజలాలతో శివలింగ స్వరూపునికి పలు అభిషేకాలు నిర్వహించి స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మ ప్రకారం కార్తీక మాసంలో సముద్ర స్నానం, కార్తీకదీపం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తే అష్టైశ్వర్యాలు సిద్దిస్తాయని తెలిపారు. వచ్చిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు.